RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 11 సంచిక : 30 శనివారం 06 - 09 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## రాష్ట్రపతికి జిన్‌పింగ్ లేఖపై ఎంఈఏ స్పందనిదే




2 లో

- అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఇండియాతో సంబంధాల పునరుద్ధణకు ఆసక్తి కనబరుస్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గత మార్చిలో
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రహస్య లేఖ రాసినట్టు 'బ్లూమ్‌బెర్గ్' ఒక కథనం ప్రచురించింది.

# తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి

- ప్రతిగ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే
- విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాలి
- మాదాపూర్ శిల్పకళావేదికలో గురుపూజోత్సవం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో గురుపూజోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారని, ప్రతిగ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులేనని చెప్పారు. ఆనాడు జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారని, తెలంగామ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలు ఏ విధంగా పరిష్కరించుకున్నారో ఆలోచించుకోవాలని ప్రశ్నించారు ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నామని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకంటే నాణ్యమైన విద్య అందస్తామని ప్రతిజ్ఞ చేద్దామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి అక్కడి విద్యావిధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణమన్న ఆయన తనకూ స్వార్థం ఉందని టీచర్లు బాగా పనిచేస్తే రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు.

- మిగతా 2 లో

## ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు



హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం.. అదే రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. అబద్ధపు హామీలు, గారడీ గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెల్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా. అని ప్రశ్నించారు. యూరియా దొరకక కళ్లముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి అర్ధరాత్రి నుంచి పోలీసులను అతని ఇంటిపైకి పంపించి రైతు లక్ష్మణ్‌ను అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తారా.. దేశానికే అన్నం పెట్టే రైతుపై ఈ రకంగా అక్రమంగా కేసు బనాయించడం దుర్మార్గమైన చర్యే కాదు.. సీఎం దిగజారుడుతనానికి కూడా నిదర్శనం.

- మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా ఒకే జీఎస్టీ రేటు

# ఇప్పట్లో అసాధ్యం

- స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- అభివృద్ధిలో అసమానతలే ప్రధాన కారణమని వెల్లడి
- బెంజ్ కారు, హవాయి చెప్పులపై ఒకే పన్ను అన్యాయమన్న మంత్రి
- పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే ఆలోచన లేదని స్పష్టం



ఢిల్లి : దేశవ్యాప్తంగా 'ఒకే దేశం-ఒకే పన్ను' విధానాన్ని అమలు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. విలాసవంతమైన బెంజ్ కారుపై, సామాన్యుడు వాడే హవాయి చెప్పులపై ఒకే రకమైన పన్ను విధించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆమె తేల్చి చెప్పారు.దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక అభివృద్ధిలో తీవ్ర అసమానతలు ఉన్నాయని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను రేటును అమలు చేయడం ఆచరణ సాధ్యం

- మిగతా 2 లో

# బిహార్ రాజకీయం కొత్త మలుపు

- మహిళా ఓటర్లు ఏం చేయబోతున్నారు
- దర్భంగ ఘటనపై ప్రధాని మోదీ ఎమోషనల్‌వ్యాఖ్యలు
- మహిళా ఓటర్లు లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రచార కార్యాచరణ



ఢిల్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిహార్ రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మొన్నటి వరకు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పై విపక్షాలు చేసిన ఆరోపణల గురించి వాడివేడి చర్చ జరగగా, ఇప్పుడు మహిళా లోకం ఆత్మగౌరవ అంశం తెరపైకి వచ్చింది. తన మాతృమూర్తిపై బిహార్‌లోని దర్భంగలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన అసభ్య వ్యాఖ్యలపై ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్వేగంతో స్పందించారు. మహిళల ఉనికికి సంబంధించిన ఈ అంశంపై కాంగ్రెస్, ఆర్‌జేడీ పార్టీలను నిలదీయాలని మహిళా ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో బిహార్ ఎన్నికల్లో ఏం జరగబోతోంది మహిళా ఓటర్లు ఎటువంటి తీర్పు ఇవ్వబోతున్నారు ఈ అంశం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి కలిసొస్తుందా గత అనుభవాలు ఏం చెబుతున్నాయి ఈ కథనంలో చూద్దాం. ఆగస్టు 27న జరిగిన దర్భంగ ఘటనపై సెప్టెంబరు 2న (మంగళవారం) ప్రధాని మోదీ ఎమోషనల్ అయ్యారు. దీన్ని బిహార్ ఎన్నికల సంగ్రామంలో కీలక ఘట్టంగా రాజకీయ

- మిగతా 2 లో

## అనవసరంగా వివాదంలోకి లాగుతున్నారు



- మాజీ సీఎం జగన్, భారతిరెడ్డిలపై చెన్నై ఎన్‌సీఎల్‌ఏటీకి నివేదించిన సరస్వతి పవర్ లిమిటెడ్
- హైదరాబాద్ ట్రైబ్యునల్ తీర్పును నిలిపివేయాలని అప్పీలు

అమరావతి : వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలోని వివాదాలకు మాజీ సీఎం జగన్, భారతిరెడ్డిలు కార్పొరేట్ ముసుగు వేస్తున్నారని చెన్నై జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)కి సరస్వతి పవర్ లిమిటెడ్ నివేదించింది. జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీల వాటాలను వైఎస్ విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల పేరుతో బదలాయింపు చట్టబద్ధంగా జరిగినా, వారి కుటుంబ వివాదాల్లోకి కంపెనీని లాగుతున్నారని, దీనివల్ల కంపెనీకి నష్టం వాటిల్లుతుందని పేర్కొంది.

- మిగతా 2 లో

## పెట్టుబడుల సాధనకు

# సహకారమివ్వండి

- ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



ఢిల్లి : ప్రధాని నరేంద్ర మోదీతో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. కేంద్ర సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర పథకాల అమలు, తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానితో లోకేశ్ చర్చించారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ భేటీ సాగింది. ఈ క్రమంలో రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని ప్రధానిని కోరారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలానే రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర

- మిగతా 2 లో

## 2309 విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణానికి

# ఏపీ ప్రభుత్వం ఆమోదం



ప్రతి హెల్త్ క్లినిక్ కు రూ. 55 లక్షలు ఖర్చు

భవన నిర్మాణానికి రూ. 42 లక్షల కేటాయింపు

ప్రహరీ గోడ, నీటి సరఫరా, విద్యుత్ తదితరాలకు రూ. 13 లక్షలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,309 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల (ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు) నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద రూ.217.10 కోట్ల నిధులను విడుదల చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి అదనంగా, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద మరో 696 కొత్త భవనాల నిర్మాణానికి కూడా అనుమతి లభించింది.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## సుప్రీంలో సుంకాల పోరు



మిగతా ప్రపంచంమీద తాను సాగిస్తున్న సుంకాల సమరం అమెరికా ప్రయోజనాల పరిరక్షణకే కాదు, యుద్ధనివారణకూ, ప్రపంచశాంతికీ కూడా అత్యంత ముఖ్యమని సుప్రీంకోర్టులో ట్రంప్ చెప్పుకున్నారు. దిగుమతులపై సుంకాలు విధించేందుకు ఫెడరల్ చట్టాల ప్రకారం అధ్యక్షుడికి విస్తృతమైన అధికారాలున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. ఆర్థిక అత్యయిక అధికారాలు వాడి సుంకాలు ప్రయోగించడం చట్టవిరుద్ధమంటూ అప్పీల్స్‌కోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో, ట్రంప్ ప్రభుత్వం అమితవేగంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు, వెంటనే విచారణ ఆరంభించి, తీర్పు త్వరితంగా వెలువడేట్టు చూడాలని కూడా విజ్ఞప్తి చేసుకుంది. ఐదునెలలుగా విదేశాలతో సాగిస్తున్న చర్చలను, సాధించిన విజయాలను దిగువకోర్టుతీర్పు అనిశ్చితిలో పడేస్తుందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారతదేశాన్ని అదనపు సుంకాలతో శిక్షిస్తూ ఉక్రెయిన్‌లో రష్యా చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్టు సుప్రీంకోర్టులో ట్రంప్ ప్రభుత్వం చెప్పుకుంది. దిగువకోర్టు అంటున్నట్టుగా ట్రంప్ తన పరిధినేమీ అతిక్రమించలేదని, ప్రపంచ దేశాలన్నింటినీ కొత్త ఒప్పందాలకు దిగివచ్చేట్టుచేసి అమెరికాను ఆర్థికంగా వెలిగేట్టు చేస్తున్నారనీ, ఈ టారిఫ్‌లు కనుక లేకుంటే అమెరికా ఏడాది క్రితం వరకూ ఉన్నట్టుగా ఇకపై శాశ్వతంగా పేదదేశంగానే మిగిలిపోతుందని ప్రభుత్వం వాదన. తాము అధికారంలోకి వచ్చిన తరువాతే దేశం కళ్ళుతెరిచిందనీ, వెలుగుతున్న దేశాన్ని చూసి మిగతా ప్రపంచం అసూయపడుతోందనీ, కుట్రలు చేస్తోందని నాయకులు చెప్పుకోవడం సహజమేకానీ, న్యాయస్థానాలు అవును నిజమేనంటాయా అన్నది ప్రశ్న. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాలచట్టం (ఐఈఈపీఏ) వాడి సుంకాలు ప్రయోగించినప్పటినుంచీ ట్రంప్ చర్యమీద చర్చ జరుగుతూనే ఉంది. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై తొలిగా విచారించిన అమెరికా వాణిజ్య న్యాయస్థానం ఆయనకు విదేశీ వాణిజ్యంతో చిత్తం వచ్చినట్టు వ్యవహరించగల విశేషాధికారాలేమీ లేవని మూడునెలల క్రితమే తేల్చేసింది. అప్పీల్స్‌కోర్టు మరునాడే ఆ తీర్పును నిలిపివేసి ట్రంప్‌కు తాత్కాలికంగా ఊరట కలిగించినా, ఇప్పుడు మంచి మెజారిటీతో కిందికోర్టు మాటే సరైనదని నిర్ధారించింది. జిమ్మీకార్టర్ కాలంలో తయారై, ఇప్పటివరకూ ఏ అధ్యక్షుడూ వినియోగించని ఈ ఆర్థిక అత్యయిక చట్టాన్ని వాడి ట్రంప్ మిగతా ప్రపంచంతో యుద్ధం చేస్తున్నాడు. ఈ పురాతన చట్టంతో తాను న్యాయస్థానాల్లో నెగ్గుకురాగలనో లేదో ట్రంప్‌కు తెలియకపోయినా న్యాయనిపుణులు తెలియచెప్పకుండా ఉండరు. తన చర్య చట్టబాహ్యమైనది అయినప్పటికీ, ట్రంప్‌కు కావల్సింది సామాన్యజనంలో రక్షకుడని అనిపించుకోవడం. గత పాలకుల చేతగానితనం వల్ల దుర్భరమైన పేదరికంలో కడుదీనాతిదీనంగా బతుకీడుస్తున్న అమెరికాను తిరిగి వెలుగుజిలుగుల అగ్రరాజ్యంగా ఉన్నతంగా నిలబెట్టే పేరిట ఆయన ఎన్ని విన్యాసాలైనా చేస్తాడు. ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' పేరిట ఆయన అక్షరక్రమంలో ప్రతీదేశానికీ టారిఫ్‌లు విధించిన దృశ్యం చూసినవారికి ఆయనకు దేశాన్ని తీర్చిదిద్దడంకంటే తాను గ్రేట్ అనిపించుకోవడం ప్రధానమని అర్థమైంది. మిగతా ప్రపంచంతో పోరాడుతున్నానని ఆయన అంటూంటే, ఆయన మీద రాష్ట్రాలు, వాణిజ్య సంస్థలు, వేదికలు న్యాయపోరాటం చేస్తూ ఒక్కోమెట్టూ ఎక్కుతున్నాయి. ట్రేడ్‌కోర్టు తీర్పులోనూ, ఇప్పుడు అప్పీల్స్‌కోర్టు తీర్పులోనూ ఆయనకు రాజకీయ కుట్రలూ, తనపట్ల ద్వేషం, దేశంపట్ల న్యాయమూర్తుల బాధ్యతారాహిత్యం కనిపించాయి. సుంకాలను సంధించి శాంతిని సాధిస్తున్నానంటూ భారత్%-%పాక్ యుద్ధాన్ని కూడా ఆయన? గతంలో న్యాయస్థానంలో వాడుకున్నాడు. దౌత్యం కంటే, చర్చలకంటే సుంకాల సమరమే సర్వరోగనివారిణి అని ఆయన నమ్ముతున్నాడు. ఎంతటి మొండిదేశాన్ని అయినా టారిఫ్‌వార్‌తో లొంగదీయగలనని గర్విస్తున్న ట్రంప్‌కు ఇది మరింత పెద్ద ఎదురుదెబ్బ. అమెరికన్ కాంగ్రెస్‌లో ఎటువంటి చర్చా చేయకుండా, దానిని పక్కకునెట్టేసి, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్‌కు రేపు సర్వోన్నత న్యాయస్థానంలో కూడా ఇదే పరిస్థితి ఎదురైతే నైతికంగా ఓడిపోయినట్టే.

# బిహార్ రాజకీయం కొత్త మలుపు

**మొదటిపేజీ తరువాయి** – పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఉద్వేగంతో మోదీ చేసిన వ్యాఖ్యల ప్రభావం బిహార్‌లోని మహిళా ఓటర్లతో పాటు పురుష ఓటర్లపైనా పడుతుందని అంటున్నారు. "ఒక తల్లిని అవమానించడాన్ని భారత భూమి ఎప్పుడూ సహించదు" అని మోదీ చెప్పారు. ఈ అంశం బిహార్‌లోని మహిళా ఓటర్లను ఆలోచింపజేసే అవకాశం ఉంది. బిహారీలు ఛటీ మైయా దేవతకు ఎంతో భక్తితో పూజలు చేస్తుంటారు. సూర్య దేవుడి సోదరే ఛటీ మైయా దేవత అని వారు నమ్ముతారు. ఛటీ మైయా దేవతను పూజిస్తే సంతానం ప్రాప్తిస్తుందని విశ్వసిస్తారు. "మా అమ్మను అవమానించేలా మాట్లాడినందుకు ఛటీ మైయాకు ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు క్షమాపణ చెప్పాలి" అని ప్రధాని మోదీ డిమాండ్ చేశారు. తద్వారా ఛటీ మైయా దేవతను ఆరాధించే బిహారీలతోనూ ఆయన కనెక్ట్ అయ్యారు. "మా అమ్మను అవమానించేలా మాట్లాడిన వాళ్లను జవాబుదారీగా నిలపాల్సిన బాధ్యత బిహార్‌లోని ప్రతీ కొడుకుపై ఉంది" అని మోదీ చెప్పారు. తద్వారా బిహార్‌లోని పురుష ఓటర్లనూ మోదీ కనెక్ట్ అయ్యారు."మహిళా శక్తిని గౌరవించే గొప్ప సంప్రదాయానికి నెలవు బిహార్. అటువంటి గొప్ప బిహార్ గడ్డపై మా అమ్మను అవమానించేలా మాట్లాడారంటే నమ్మలేకపోతున్నాను. ఆర్జేడీ–కాంగ్రెస్ స్టేజీపై నుంచే అలాంటి కూతలు కూశారు. మా అమ్మ ప్రస్తుతం భౌతికంగా ఈ లోకంలో లేదు. పైగా ఆమెకు రాజకీయాలతో సంబంధమే లేదు. అయినా తప్పుడు భాషతో మా అమ్మను అవమానించారు. దీనివల్ల ఏర్పడిన బాధను నేను బిహార్ తల్లులు, సోదరీమణులు, కుమార్తెల కన్నీళ్లలో స్పష్టంగా చూడగలిగాను. అమ్మపై అసభ్యంగా మాట్లాడినందుకు మోదీ మిమ్మల్ని క్షమిస్తాడు. కానీ ఒక తల్లికి జరిగిన అవమానాన్ని భారత భూమి ఎప్పుడూ సహించదు. అందుకే ఛటీ మైయాకు ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు క్షమాపణలు చెప్పాలి. ఈ చేష్టకు పాల్పడిన వాళ్లను జవాబుదారీగా నిలపాల్సిన బాధ్యత బిహార్‌లోని ప్రతీ కొడుకుపై ఉంది. ఆ పార్టీల నాయకులు ఏ వీధికి, ఏ నగరానికి వచ్చినా ప్రతీ తల్లి, సోదరి నిలదీయాలి. వారి నుంచి సమాధానాలు అడగాలి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో సెప్టెంబరు 4న బిహార్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. దర్భంగ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ క్షమాపణలు చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. తదుపరిగా బిహార్ వ్యాప్తంగా పర్యటించేందుకు అధికార ఎన్డీఏ కూటమి మహిళా మోర్చా సిద్ధమవుతోంది. మహిళా మోర్చా కార్యకర్తలు నిర్వహించే ర్యాలీలలో ఎన్డీఏ కూటమికి చెందిన అగ్రనేతలు కూడా పాల్గొననున్నారు. బిహార్‌లోని మహిళా ఓటర్లు లక్ష్యంగా ఈ కార్యక్రమాలను ఎన్డీఏ కూటమి ముందుకు తీసుకెళ్లనుంది. దశలవారీగా ఉద్యమాన్ని నిర్వహించడానికి సిద్ధం "విపక్ష ఇండియా కూటమిది ఇతరులను దూషించే సంస్కృతి. వారికి మహిళలను ఎలా గౌరవించాలో తెలియదు. దర్భంగ ఘటనపై బిహార్ మహిళలు ఆగ్రహంతో, బాధతో ఉన్నారు. దీనిపై మేం వీధుల్లోకి అడుగుపెట్టడానికి రెడీ అవుతున్నాం. ఇందులో భాగంగానే తొలుత బిహార్ బంద్‌కు పిలుపునిచ్చాం. ఆ తర్వాత దశలవారీగా ఉద్యమాన్ని నిర్వహించడానికి మేం సిద్ధమవుతున్నాం. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ క్షమాపణలు చెప్పే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని బిహార్ బీజేపీ అధికార ప్రతినిధి అనామిక పాశ్వాన్ వెల్లడించారు. మరోవైపు, బీజేపీ చేస్తున్న విమర్శలకు మహాఘట్‌బంధన్ కూటమిలోని పార్టీలు కూడా కౌంటర్ ఎటాక్ చేస్తున్నాయి. గతంలో మహిళలపై బీజేపీ నేతలు చేసిన కామెంట్స్‌ను ఇప్పుడు తెరపైకి తెస్తున్నారు. ఇతరుల తల్లులను దుర్భాషలాడిన చరిత్ర వాళ్లదేనని రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) అగ్రనేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. సోనియా గాంధీపై చేసిన చౌకబారు వ్యాఖ్యలు అందరికీ తెలుసని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేశ్ రాథోడ్ చెప్పారు. ఇతరుల తల్లులను దుర్భాషలాడిన చరిత్ర వాళ్లది : తేజస్వీ "మహిళలు, మాతృ మూర్తులను ఎవరైనా గౌరవించాల్సిందే. వారు పూజనీయులు. ప్రధాని మోదీ తల్లిని కొందరు దుర్భాషలాడిన సంఘటన ఖండించదగినది. కానీ బీజేపీ నాయకులు, నరేంద్ర మోదీకి ఇతరుల తల్లులను దుర్భాషలాడిన చరిత్ర ఉంది. వారు ఈ చౌకబారు సంస్కృతికి అతీతంగా ఎదగాలి. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ల హక్కుల యాత్ర విజయం సాధిస్తుందనే భయంతోనే ఈ అంశాన్ని బీజేపీ పెద్దదిగా చేస్తోంది. బిహారీల నిజమైన సమస్యలపై చర్చించడానికి బీజేపీ సిద్ధంగా లేదు" అని రాష్ట్రీయ అగ్రనేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు."ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ కానీ, తేజస్వి యాదవ్ కానీ వ్యాఖ్యలు చేయలేదు. అలాంటప్పుడు వాళ్లిద్దరు ఎందుకు క్షమాపణలు చెబుతారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపించినందు వల్లే ఈ అంశాన్ని పెద్దగా చేసి చూపిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే బీజేపీకి చెందిన చాలామంది పెద్ద నాయకులు మా నాయకులపై గతంలో ఎన్నో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ, ఇతర ప్రతిపక్ష పార్టీల మహిళా నేతలపై బీజేపీ నాయకులు, ప్రధానమంత్రి మోదీ ఎలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేశారో అందరికీ తెలుసు. ఏ మహిళపై అసభ్య వ్యాఖ్యలు చేసినా మేం సమర్థించం. అలాంటి ఘటనలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది" అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేశ్ రాథోడ్ చెప్పారు.

## కుటుంబ వివాదానికి కార్పొరేట్ ముసుగు - అనవసరంగా వివాదంలోకి లాగుతున్నారు'

**మొదటిపేజీ తరువాయి** – విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని, దీని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాలు చేస్తూ జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేయగా వాటాల బదలాయింపును రద్దు చేస్తూ, జగన్ తదితరుల పేర్లను పునరుద్ధరించాలంటూ జులై 29న తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఆ తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నై ఎన్‌సీఎల్‌ఏటీలో సరస్వతి పవర్ లిమిటెడ్ అప్పీలు దాఖలు చేసింది. విజయమ్మకు సంపూర్ణ హక్కులు : 'మొదట సరస్వతి కంపెనీకి జగన్ డైరెక్టర్‌గా ఉండేవారు. వాటాలను తల్లికి గిఫ్ట్‌డీడ్ చేసి, డైరెక్టర్ పదవి నుంచి తప్పుకున్నారు. అంటే, కంపెనీతో సంబంధాలు వదులుకున్నారు. వివాదం తలెత్తకముందు కూడా విజయమ్మ 48.99%తో పెద్ద వాటాదారు. జగన్‌కు 29.88%, భారతిరెడ్డికి 16.30%, క్లాసిక్ రియాల్టీకి 4.83% వాటాలుండేవి. 2021 జులై 26లో జగన్, భారతీరెడ్డిలు గిఫ్ట్‌డీడ్ చేసి ఇచ్చారు. దాంతో విజయమ్మకు సంపూర్ణ హక్కులు లభించాయి. విజయమ్మ, జనార్దన్‌రెడ్డిలు కంపెనీకి లేఖలు రాస్తూ వాటాల బదలాయింపు పత్రాలు కనిపించలేదంటూ నోటరీ లేకుండా అఫిడవిట్‌లు సమర్పించగా, వాటిపై అభ్యంతరం వ్యక్తమైంది. నోటరీతో అఫిడవిట్ దాఖలు చేయడంతో 2024 జులై 2నాటి బోర్డు సమావేశంలో జగన్, భారతిరెడ్డిలు ఇచ్చిన గిఫ్ట్‌డీడ్, క్లాసిక్ రియాల్టీ విక్రయించిన వాటాలను విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేర్లతో బదలాయించడానికి తీర్మానం జరిగింది. జులై 6న వాటాల బదలాయింపు జరగ్గా విజయమ్మకు 99.75%, చాగరి జనార్దన్‌రెడ్డికి 0.25% ఉన్నాయి. ఆ తర్వాత కుటుంబ వివాదం గురించి ఆర్వోసీకి సమాచారం ఇచ్చారు' అని అందులో తెలిపారు. జప్తు కంటే ముందే వాటాల బదలాయింపు : '2019 ఆగస్టు 31న విజయమ్మకు, జగన్‌కు మధ్య ఎంఓయూ కుదిరింది. దీని ప్రకారం జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీ, సండూర్ పవర్ కంపెనీలకు సరస్వతిలో ఉన్న వాటాలను విజయమ్మ పేరుతో బదలాయించేందుకు అంగీకారం కుదిరింది. సరస్వతి వాటాల తక్షణ బదలాయింపునకు అవకాశం ఉంది. ఎందుకంటే సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో నిందితుల జాబితాలో సరస్వతి లేదు. వాటాల బదలాయింపు జరిగిన చాలాకాలం తర్వాత ఈ ఏడాది మార్చి 31న వాటాల జప్తు జరిగింది' అని ఎన్‌సీఎల్‌ఏటీ దృష్టికి సరస్వతి పవర్ తీసుకొచ్చింది. 'క్లాసిక్ రియాల్టీకి ఉన్న 71.50 లక్షల వాటాలను విజయమ్మ పేరుతో బదలాయించడాన్ని సవాలు చేయలేదు. 11,37,874 వాటాలను విజయమ్మ రూ.3.07 కోట్లకు కొనుగోలు చేయగా, జగన్ 74.26 లక్షలు, భారతి 40.50 లక్షల వాటాలను గిఫ్ట్‌గా ఇచ్చారు. వాటాల కొనుగోలుపై ఎక్కడా వివాదం లేదు' అని చెప్పింది. రద్దు చేస్తే పలు ఇబ్బందులు : జగన్ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు, రాతపూర్వకంగా సమర్పించిన వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా హైదరాబాద్ ట్రైబ్యునల్ తీర్పు వెలువరించిందని తెలిపింది. వాస్తవాలన్నీ కంపెనీకి అనుకూలంగా ఉన్నాయని, లావాదేవీలను విశ్వసించి చట్టప్రకారం వాటాలను విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేర్లతో బదలాయించి రిజిస్టర్‌లో పేర్లను నమోదు చేసినట్లు తెలిపింది. దీన్ని రద్దు చేయడం వల్ల కంపెనీ నిర్వహణతో పాటు పలు ఇబ్బందులకు అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. సెక్షన్ 59 పరిధిని దాటి కుటుంబ వివాదాల్లో మౌఖిక అవగాహనలను ఆధారంగా తీసుకుని హైదరాబాద్ ట్రైబ్యునల్ వెలువరించిన తీర్పును రద్దు చేయాలని కోరింది. సరస్వతి కంపెనీ తరఫున న్యాయవాది ఎం. మహర్షి విశ్వరాజ్ ఈ అప్పీలు దాఖలు చేశారు. దీనిపై త్వరలో విచారణ జరగనుంది.

# తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి



**మొదటిపేజీ తరువాయి** – అందరం కలిసి కష్టపడదాం : టీచర్లే కష్టపడితే తాను సీఎం అవుతా అనట్లేదని, మీతో పాటే తాను కష్టపడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఫామ్‌హౌస్‌లో పడుకుంటా మళ్లీ సీఎంను చేయండి అనట్లేదని పరోక్షంగా విమర్శలు చేశారు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని వెల్లడించారు. ఐటీఐలు అప్‌గ్రేడ్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చామని, ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే తనకే మతిపోతుందని సీఎం అన్నారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.'తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి. దిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పనిచేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నా. టీచర్లే కష్టపడండి నేను సీఎం అవుతా అనట్లేదు మీతో పాటే నేనూ కష్టపడతా" – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటీనే 16 స్వర్ణ పతకాలు సాధించిందని రేవంత్ రెడ్డి అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండని వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. చదివితేనే భవిష్యత్ కాదని క్రీడల్లో రాణించినా భవిష్యత్ ఉంటుందని అన్నారు. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీలుగా ప్రస్తుతం ఉన్నారని ప్రశంసించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి పెడ్లర్‌గా మారుతున్నారని, డ్రగ్స్ వ్యసనాలు చిన్న మండలాలకు వ్యాపించిందని అన్నారు. పిల్లలను తల్లిదండ్రులు నిశితంగా పరిశీలించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ ఫోర్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు. మూతపడే పరిస్థితికి ఓయూ : చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదని, విద్యార్థులకు గత ప్రభుత్వం సరైన ఆహారం అందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆక్షేపించారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని, కొత్త నియామకాలను గత ప్రభుత్వం నియమించలేదని, గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా వర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చానన్న సీఎం రేవంత్ గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా? అందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్ల సహకారం కావాలని, పిల్లలు ఎక్కువ సమయం వారి వద్దే ఉంటారని అన్నారు. పిల్లలతో కలిసే టీచర్లు మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. 3 లక్షల మంది విద్యార్థులు కొత్తగా : గత ప్రభుత్వానికి వర్సిటీలకు వీసీలను నియమించడానికి తీరిక కూడా లేదని, దానిలో కూడా రాజకీయాలు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. ప్రభుత్వం, టీచర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని కొనియాడారు. ప్రైవేట్ స్కూళ్ల టీచర్ల కంటే ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అత్యంత వివాదాస్పదమైన విద్యాశాఖను తీసుకోవద్దని తనకు కొందరు సూచించారన్న సీఎం అయినా సరే స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న సీఎం : అంతకు ముందు సీఎం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రేవంత్‌రెడ్డి తీర్థప్రసాదాలను స్వీకరించారు. 71 ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణపతిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించిందని, దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందిందని సీఎం అన్నారు. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈ రోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను విజయవంతంగా కొనసాగిస్తోందని, గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించిందని, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నామన్నారు. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## దేశవ్యాప్తంగా ఒకే జీఎస్టీ రేటు ఇప్పట్లో అసాధ్యం

**మొదటిపేజీ తరువాయి** – కాదని ఆమె పేర్కొన్నారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీని ప్రవేశపెట్టిన దివంగత నేత అరుణ్ జైట్లీతో తనకు జరిగిన సంభాషణను ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. "బెంజ్ కారును, హవాయి చెప్పులను ఒకే గాటన కట్టి ఒకే పన్ను విధించగలమా అని జైట్లీ గారు అనేవారు. బెంజ్ కారు కొనే వ్యక్తి ఎక్కువ పన్ను చెల్లించగలడు. కానీ, హవాయి చెప్పులు కొనే సామాన్యుడు అంత భారం మోయలేడు. అందుకే ప్రస్తుతానికి దేశంలో ఒకే జీఎస్టీ రేటు లేదు. అలా చేయడం అన్యాయం అవుతుంది" అని నిర్మల వివరించారు. దేశంలోని అన్ని ప్రాంతాలు సమానంగా ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడు మాత్రమే ఒకే పన్ను విధానం గురించి ఆలోచించగలమని ఆమె తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన పన్నుల ప్రయోజనాలు పూర్తిగా వినియోగదారులకు చేరేలా కఠినమైన పర్యవేక్షణ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఇదే సమయంలో, పరిశ్రమ వర్గాల నుంచి డిమాండ్లు వస్తున్నప్పటికీ పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన ప్రస్తుతానికి లేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అలాగే, రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పునరుద్ధరించే ప్రణాళికలు కూడా లేవని ఆమె తేల్చి చెప్పారు.

## రాష్ట్రపతికి జిన్‌పింగ్ లేఖపై ఎంఈఏ స్పందనిదే

**మొదటిపేజీ తరువాయి** – న్యూఢిల్లీతో సంబంధాల పునరుద్ధరణ కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రహస్య లేఖ పంపినట్టు మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని కేంద్రం కొట్టివేసింది. వార్తను ప్రచురించే ముందు బాధ్యతతో వ్యవహరించాలని మీడియాను కోరింది. 'మీడియాలో వచ్చిన కథనం మా దృష్టికి వచ్చింది. లేఖ రాయడంలో ఎంతమాత్రం నిజం లేదు' అని ఎంఈఏ ప్రతినిధ రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. వార్తను రిపోర్ట్ చేసేటప్పుడు మీడియా మిత్రులు తగిన బాధ్యతతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఇండియాతో సంబంధాల పునరుద్ధణకు ఆసక్తి కనబరుస్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గత మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రహస్య లేఖ రాసినట్టు 'బ్లూమ్‌బెర్గ్' ఒక కథనం ప్రచురించింది. యూఎస్‌తో ఎలాంటి డీల్ కుదుర్చుకున్నా అది చైనా ప్రయోజనాలకు భంగకరమవుతుందని జిన్‌పింగ్ ఆందోళన వ్యక్తం చేసినట్టు ఒక భారత అధికారిని ఉటంకిస్తూ ఆ కథనం పేర్కొంది. 2020 గల్వాన్ ఘర్షణల అనంతరం క్షీణించిన భారత్–చైనా సంబంధాలను తిరిగి మెరుగుపరుచుకునేందుకు భారత్–చైనా ఇటీవల ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనేందుకు చైనాలోని టియాంజిన్ వెళ్లారు. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపారు. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ప్రాతిపదికగా చైనాతో సంబంధాలను ముందుకు తీసుకువెళ్లేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉందని మోదీ ప్రకటించారు. ఇండియా–చైనా మిత్రులుగా ఉండాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాన్ని భారత్ వ్యతిరేకించడాన్ని బహిరంగంగానే సమర్థించారు. ఈ క్రమంలోనే చైనాకు భారత్, రష్యా లొంగిపోయాయని ట్రంప్ శుక్రవారంనాడు సంచలన వ్యాఖ్యలు చేసారు.

## ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు

**మొదటిపేజీ తరువాయి** – ఇందిరమ్మ రాజ్యంలో బస్తా యూరియాకు దిక్కులేక అల్లాడుతున్న అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా%?% రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలె అని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లపాటు ఎన్నడూ లేని యూరియా సంక్షోభాన్ని తన చేతకానితనంతో సృష్టించిన రేవంత్‌పై కోపాగ్నితో రగిలిపోతున్న లక్షలాది రైతులపై కేసులు పెట్టే దమ్ము ఈ సర్కారుకు ఉందా..? పల్లెపల్లెనా ఈ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులందరిని అరెస్టు చేయడానికి ఈ పోలీసులు సరిపోరు. ఈ రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవు. కడుపుకాలిన తెలంగాణ రైతులతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి, తన పాత గురువును అడిగి తెలుసుకుంటే మంచిది. ఇకనైనా ఈ అక్రమ కేసులు బనాయించి అమాయక రైతు లక్ష్మణ్‌ను వేధించడం మానుకోకపోతే, అతనికి రక్షణ కవచంగా బీఆర్ఎస్ ఉంటది. రాష్ట్రంలోని అన్నదాతలను బీఆర్ఎస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

## 2309 విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణానికి

### ఏపీ ప్రభుత్వం ఆమోదం.. గ్రామీణ ఆరోగ్యానికి పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి** – ప్రతి హెల్త్ క్లినిక్ యూనిట్ నిర్మాణానికి మొత్తం రూ.55 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఇందులో భవన నిర్మాణం కోసం రూ.42 లక్షలు కేటాయించగా, ప్రహరీ గోడ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కోసం మరో రూ.13 లక్షలు వినియోగించనున్నారు. గ్రామీణ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో నివసించే నిరుపేద ప్రజలకు మెరుగైన, సులభతరమైన వైద్య సేవలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా నివారించవచ్చని, అదే సమయంలో ఆరోగ్య సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలు కలుగుతుందని వారు భావిస్తున్నారు.

## హైదరాబాద్ మెట్రో గుడ్‌న్యూస్

**మొదటిపేజీ తరువాయి** – గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు హైదరాబాద్ సిద్ధమైంది. నిమజ్జన ఉత్సవాలను చూసేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. వారంతా తిరుగు ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి ప్రయాణికుల కోసం హైదరాబాద్ మెట్రో శుభవార్త చెప్పింది. అన్ని మెట్రో స్టేషన్ల నుంచి రేపు (శనివారం) ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. దీంతో నిమజ్జనాన్ని చూసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ఊరటను కలిగిస్తుంది. మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం : గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత 20 రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేశామని హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వినాయక నిమజ్జనాలకు సంబంధించి చెరువులను అన్నింటినీ పరిశీలించినట్లు వివరించారు. రేపటి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. ట్యాంక్‌బండ్?, హుస్సేన్ సాగర్?, ఎన్టీఆర్ ఘాట్ వద్ద 40 క్రేన్లు ఏర్పాటు చేశామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. పోలీసుల సూచనల మేరకు మండపాల నుంచి వెళ్లాలని సూచించారు. వాహనాలు, విగ్రహాలు ఎత్తు ఎక్కువగా ఉంటే పోలీసుల అనుమతితో నిమజ్జనానికి తీసుకెళ్లాలని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రతి ఏరియాపై మ్యాప్ వేసుకొని రూట్స్ డిసైడ్ చేశామన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు అనుసరించాలని కోరారు. రోడ్లపై డైవర్షన్ ఉన్న చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తి చేస్తామని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## పెట్టుబడుల సాధనకు సహకారమివ్వండి



**మొదటిపేజీ తరువాయి** – విద్యారంగంలో అనేక రకాల సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తగిన సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15 నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మోదీకి లోకేశ్ వివరించారు. దీనికి ప్రధాని స్పందిస్తూ రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. అలానే యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా మోదీకి లోకేశ్ బహుకరించారు. మే 17న తన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌లతో మోదీని కలిసిన లోకేశ్ 4 నెలల వ్యవధిలో మళ్లీ ప్రధానిని కలవడం విశేషం. మంత్రి లోకేశ్ ఒకరోజు దిల్లీ పర్యటన ముగించుకుని అమరావతి బయల్దేరారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి: టీచర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వైఎస్సార్సీపీ చర్యల్ని మంత్రి నారా లోకేశ్ ఖండించారు. ఫేక్ హ్యాండిల్స్ ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్న ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు. వైఎస్సార్సీపీ తన ఫేక్ హ్యాండిల్‌లో ఒక ఫొటోను షేర్ చేసిందని పేర్కొన్నారు. వేరే రాష్ట్రంలో ఆ ఘటన జరిగితే ఏపీలో పని చేస్తున్న టీచర్లు మద్యం తాగి బెంచీల కింద పడుకుంటున్నారన్న రీతిలో అతి జుగుప్సాకరంగా అందులో వ్యాఖ్యానం ఉందని ఇది చాలా బాధాకరమని మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో వేరే రాష్ట్రంలో వచ్చిన ఫొటోను ఏపీలో జరిగినట్లు చెప్పడం క్షమించరాని నేరమని గురువుల పట్ల కూడా నీతిబాహ్యమైన చర్యలతో వైఎస్సార్సీపీ మరింత దిగజారిందని అన్నారు. ఇలాంటి నేరాలను ఇప్పటికే వాళ్లు చాలా చేశారని ఇంక ఆ పార్టీ చర్యల్ని అర్థం చేసుకుని తగిన రీతిలో స్పందించాల్సిందిగా టీచర్లను కోరుతున్నానని మంత్రి లోకేశ్ అన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 06 - 09 - 2025

# దీపావళి కానుకగా జీఎస్టీ సంస్కరణలు: నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ :నవంబర్ 05:తెలంగాణ సేన న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణలు దేశ ప్రజలకు దీపావళి కానుక అని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రక నిర్ణయం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొంటూ, ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు పెద్ద ఉపశమనం లభించిందని తెలిపారు. రోజువారీ వాడే హెయిర్ ఆయిల్, షాంపూ, టూత్‌పేస్ట్, బటర్, నెయ్యి వంటి వాటిపై జీఎస్టీ 18% %d% 12% నుంచి కేవలం 5%కి తగ్గుతుందని వివరించారు. అలాగే రైతులకు మేలు జరిగేలా ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యంత్రాలపై పన్నులు భారీగా తగ్గుతాయని అన్నారు. ఆరోగ్య రంగంలో ఆరోగ్య బీమా, మెడికల్ ఆక్సిజన్, డయాగ్నస్టిక్ కిట్‌లపై జీఎస్టీ తగ్గడం లేదా పూర్తిగా రద్దు



కావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. విద్యారంగంలో ఉపయోగించే మ్యాప్స్, గ్లోబ్స్, పెన్సిల్స్, నోట్‌బుక్స్ వంటి వాటిపై జీఎస్టీ పూర్తిగా రద్దు కానుందని చెప్పారు.జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపుతో మధ్యతరగతి కుటుంబాలకు ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. టీవీలు, ఏసీలు, మానిటర్లు, డిష్ వాషింగ్ మెషీన్స్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్ను 28% నుంచి 18%కి తగ్గుతుందని తెలిపారు. అలాగే రవాణా రంగంలో హైబ్రిడ్ కార్లు, పెట్రోల్/డీజిల్ వాహనాలు, బైక్‌లు, ఆటోలపై పన్నులు తగ్గి ధరలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.జిల్లా ఉపాధ్యక్షురాలు గంగ అలివేలు మంగ మాట్లాడుతూ, ఈ సంస్కరణ కేవలం పన్ను తగ్గింపు కాదని, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం, రైతులకు నమ్మకం, వ్యాపారానికి అవకాశం, దేశానికి అభివృద్ధిని తీసుకొస్తుందని అన్నారు. మోదీ నాయకత్వంలో సంస్కరణలు ప్రజల జీవితాల్లో సంతోషాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థలో వేగాన్ని పెంచుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, రావుల రామ్నాథ్, చందు. ముధోల్ మండల అధ్యక్షులు కోరి పోతన్న ధరంపూరి శ్రీనివాస్. లడ్డు. పోతన్న తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు బైరీ శంకర్ ముదిరాజ్



**తెలంగాణ సేన :** జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేద - మధ్యతరగతి వర్గాలకు నిజమైన బహుమానం అని సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "పేదల భారం తగ్గించాలనే హృదయ పూర్వక ఉద్దేశంతో మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారు. నష్టాన్ని లెక్కచేయకుండా ప్రజల మేలు కోసం పనిచేయగల శక్తి బీజేపీకే ఉంది" అన్నారు.దసరా, బతుకమ్మ, దీపావళి పండుగల ముందు వచ్చిన ఈ నిర్ణయం గృహిణులకు, వినియోగదారులకు పెద్ద ఊరట కలిగించిందన్నారు. దినసరి అవసరాలపై పన్నులు తగ్గడంతో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు.ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి సుమారు ?40,000 కోట్ల ఆదాయం నష్టం కలుగుతుందని, అయినప్పటికీ ప్రజల సంక్షేమమే ప్రధానం అని మోడీ చూపించారని ఆయన అన్నారు.ఆరోగ్యరంగంలోనూ జీఎస్టీ తగ్గింపు సాధారణ ప్రజలకు చౌకైన వైద్యం, బీమా సదుపాయాలు అందిస్తుందని తెలిపారు. "జీఎస్టీ తగ్గింపు కేవలం పన్ను నిర్ణయం మాత్రమే కాదు, పేద - మధ్యతరగతికి పండుగ కానుక"అని అన్నారు.

# నిర్మల్‌లో గణేష్ నిమజ్జనం కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**నిర్మల్ :నవంబర్ 05:తెలంగాణ సేన న్యూస్ :** గణేష్ నిమజ్జన శోభాయాత్రను విజయవంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు నిర్మల్ జిల్లా పోలీసు శాఖ విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శోభాయాత్ర సాగే మార్గంలో, ప్రధాన కూడళ్ల వద్ద, అలాగే బంగల్‌పేట్‌లోని నిమజ్జన ఘాట్ వద్ద మొత్తం 180 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల దృశ్యాలను నేరుగా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి, ప్రతి కదలికపైనా నిఘా ఉంచుతున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించేందుకు యాత్ర మార్గంలో ఉన్న ధార్మిక స్థలాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు.ఈ నిమజ్జన కార్యక్రమం కోసం జిల్లా ఎస్పీతో పాటు, ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు ఏఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్లు, 31 మంది ఎస్ఐలు, 106 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 323 మంది కానిస్టేబుళ్లు, 31 మంది మహిళా పోలీసులు సహా మొత్తం 508 మంది పోలీసులను మోహరించారు. నిమజ్జన ఘాట్ల వద్ద స్విమ్మర్లు, క్రేన్ ఆపరేటర్లతో మాట్లాడి వారి సన్నద్ధతను ఎస్పీ సమీక్షించారు.హైకోర్టు ఆదేశాల ప్రకారం, డీజే సౌండ్ పరిమితికి లోబడే వినియోగించుకోవాలని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలను



పోలీసులు ఇచ్చిన సూచనలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో విజయవంతం చేయాలని ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రజలను కోరారు.

# విఘ్నేశుని శోభాయనం



**కొత్తగూడ తెలంగాణ సేన :** మండల కేంద్రంలోని జోహార్ లాల్ నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆనవైతిగా నిర్వహిస్తున్న శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ధూప దీప నైవేద్యాలు ప్రతిరోజు నిత్య అన్నదానం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు నిమజ్జనంలో భాగంగా శుక్రవారం నాడు గణనాధుని శోభాయనం నిమజ్జనంలో ఊరేగింపు చేశారు భక్తులు స్వామివారికి టెంకాయలు కొట్టి వారి మొక్కులు చెల్లించుకున్నారు.

# పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన వేడుకలు

**విగ్రహ దాత సబ్బని భవాని-సత్యనారాయణ**

**అధ్యక్షులు సుంకెనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టా**

**అంబరాన్నంటిన నిమజ్జన వేడుకలు, కన్నుల పండువగా శోభాయాత్ర**















**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది సెప్టెంబర్ 05 :** హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామంలో పద్మశాలి సేవా సంఘం లో ప్రతి సంవత్సరం లాగే,ఈసంవత్సరం కూడా నూతన అధ్యక్షులు సుంకెనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టా చెయ్యడం జరిగింది.తొమ్మిది రోజులు ఉదయం,సాయంత్రం ఘనమైన పూజలందుకున్న గణపయ్యకు భక్తులు ఘనంగా వీడ్కోలు శుక్రవారం రోజున పలికారు. రంగు రంగుల కాగితాలు,పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహాన్నీ ఉంచి కన్నుల పండుగగా శోభయాత్ర నిర్వహించారు.దారి పొడవునా డప్పు చప్పుళ్లు, నృత్యాల హోరీరుతో వైభవంగా సాగిన వినాయక నిమజ్జనంలో అడుగడుగునా గణపయ్యకు భక్తులు నీరాజనం పలికారు. జై గణపతి జై జై గణపతి... గణపతి బొప్ప మోరియా ఆదాలడ్డూ కాలియా అంటూ భక్తులు, నినాదాలు మిన్నంటగా తీన్మార్ డ్యాన్సు లు, ప్రత్యేక డీజే చప్పుడ్లతో పాటు అతివల కోలాటం, చిన్నారుల కేరింతల నడుమ విఘ్నేశుడిని చెరువులో నిమజ్జనం చేసి 'పోయిరా గణపయ్యా పోయిరా' అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత సబ్బని భవాని-సత్యనారాయణ, అధ్యక్షులు సుంకెనపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తలకొక్కుల శ్రీనివాస్ ,గౌరవ సలహాదారులు సంగెం వెంకటస్వామి, కొక్కుల రవీందర్, గౌరవ అధ్యక్షులు సంగెం డాక్టర్ ఐలయ్య , మరియు సంగెం ధర్మయ్య, సంగెం శ్రీధర్, బొల్లు కృష్ణమూర్తి, కొక్కుల సుధాకర్ , తుమ్మ రాజేశం, సుంకెనపెల్లి వెంకటేశ్వర్లు,రాజేష్, వెంకటేష్, సంగెం లోకేష్, కుసుమ ఈశ్వర్ , ఆంజనేయులు తలకొక్కుల సమ్మయ్య, మరియు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భోసి వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు



**తానూర్,సెప్టెంబర్ 5(తెలంగాణ సేన న్యూస్):** నిర్మల్ జిల్లా: తానూర్ మండలంలోని భోసి గ్రామంలో జరుగుతున్న వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి,ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై,స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు,భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది,నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు,ఈ సందర్భంగా శ్రీ నయనం నృత్య కళానిలయం,భైంసాకు చెందిన నాట్య కళాజాత బృందం ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి,ఈ ప్రదర్శనలు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి.

# నిర్మల్‌లో ప్రైవేట్ ఉపాధ్యాయులకు 'ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ' ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

**నిర్మల్ :నవంబర్ 05:తెలంగాణ సేన న్యూస్ :** ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్మల్ జిల్లాలో 'ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ' వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. సొసైటీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎంపికైన 100 మంది



టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు టీచర్ల కృషిని గుర్తించడం తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రైవేటు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఈ ఏడాది తొలిసారిగా 100 మంది టీచర్లకు ఈ అవార్డులు ఇచ్చామని, వచ్చే ఏడాది నుంచి వెయ్యి మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పాషా వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీనియర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ లింబాద్రి, టీఎన్‌జీవో ప్రెసిడెంట్ వేల్మల ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ కృష్ణంరాజు, గౌరవ సలహాదారు డాక్టర్ వేణుగోపాల్ కృష్ణ, ట్రస్మా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రైవేట్ టీచర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అంకితభావంతో ఉపాధ్యాయులకు గుర్తింపు

**విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం**

**17మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**

**హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**


















**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5 (తెలంగాణ సేన) :** అంకితభావంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అతిథులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. ఇందులో భాగంగా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసిందని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని, బదిలీలకు అవకాశం కల్పించిందని వివరించారు ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వర్గాల విద్యార్థులకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందని వెల్లడించారు. అలాగే ఏ టి సి సెంటర్లు మంజూరు చేసిందని దీంతో విద్యార్థులు యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యత అది పుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మారుతున్న కాలానికి అణుగుణంగా ఉపాధ్యాయులు కూడా సాంకేతిక, నైపుణ్యతను అందిపుచ్చుకోవాలని, విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేస్తారని వివరించారు. రాష్ట్రంలో జిల్లాను విద్యారంగంలో ఉన్న స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఉత్తమ అవార్డులు పొందిన టీచర్లను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉపాధ్యాయులు కూడా విశేష కృషి చేసి అవార్డులు స్వీకరించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక అవ్వాలి**

జిల్లాలోని టీచర్లు జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక అవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా టీచర్లు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఆయన సేవాగుణం, అంకితభావం, విలువలు, నైపుణ్యతను ఉపాధ్యాయులు అందరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో మన జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచిందని, జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఉపాధ్యాయులందరూ అంకితభావంతో సేవలందిం చాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా బోధించాలని, విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే..**

చకినాల శ్రీనివాస్, గుర్రం కృష్ణారెడ్డి, కైరి పద్మ, సీహెచ్ సత్తయ్య, గోలి రాధాకిషన్, అరుకాల బాల్ రెడ్డి, బోగారపు నవీన్, కట్ట రవీందర్, గోవులకొండ శ్రీనివాస్, ఎన్ దేవేందర్, నరహరి నాగమణి, జంగిటి రాజు, పీచు సుభాష్ రెడ్డి, గుండమనేని మహేందర్ రావు, దిడిగం స్రవంతి, బద్దం రవీందర్ ఓరుగంటి పద్మకళకు అవార్డులు అందజేసి, సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపారెడ్డి, రాజు, డీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# జై జై బాయ్ బాయ్ అంటూ భక్తిశ్రద్ధలతో వినాయకుడికి వీడ్కోలు

**ఆనందోత్సవాల మధ్య చంద్ర సిద్దార్థ యూత్ వినాయకుడి నిమజ్జనం**







**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది సెప్టెంబర్ 05 :** నవరాత్రులు విశేష పూజలతో ఆరాధించిన గణపయ్యను శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో చంద్ర సిద్ధార్థ యూత్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం పంజాల తిరుపతి గౌడ ఆధ్వర్యంలో అంబరానటింది. భక్తి పాటలతో నృత్యాలు చేస్తూ వెళ్లి రావయ్యా గణపయ్య అంటూ వీడ్కోలు పలికారు. ఆధ్యాంతం వినాయకుడి శోభాయాత్ర భక్తి ప్రభక్తులతో కొనసాగగా ఈ కార్యక్రమంలో పంజాల చందూగౌడ్ పంజాల సిద్ధార్థ గౌడ్, పంజాల ఓదెల గౌడ్, పంజాల సమ్మయ్య గౌడ్, గుర్రం కిడ్నాన్ గౌడ్, బండి సిద్దేశ్వర్ గౌడ్, సాయి కృష్ణ రెడ్డి, వెంకట కుశ్వంత్, అనంతల అజిత్ కుమార్, సాయికిరణ్, జాగ్రత్, బండ సాయికిరణ్, బండ సాయిరాం, పంజాల భాస్కర్ గౌడ్, పంజాల ప్రభాకర్ గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, మహిళా భక్తులు పంజాల నాగమణి, పంజాల పద్మశ్రీ, నాగుల చందన, పంజాల సంధ్య, పంజాల లావణ్య, పంజాల శ్రీలత, పంజాల కాంతమ్మ మంగళ హారతులతో దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

# శ్రీరామభక్తిసామ్రాజ్యం

**మల్కాజ్గిరి, తెలంగాణ సేన న్యూస్ :** గురువుగారు మల్లెల దక్షిణామూర్తి సైనిక్ పూరి రామాలయంలో ప్రారంభించిన వేదిక నవరత్న కీర్తనల శిక్షణతో మొదలై ఎనిమిది సంవత్సరములు పూర్తిచేసుకొనడం చాలా సంతోషించదగిన విషయం. ఈ వేదిక శ్రీరామ భక్తి సామ్రాజ్యంగా విస్తరించి సంగీతం తో పాటు ఆధ్యాత్మిక విషయాలలో కూడా అంటే దక్షిణామూర్తి స్తోత్రము భగవద్గీత అధ్యయనములో కూడా శిక్షణ కొనసాగిస్తుండటం గురువుగారి దంపతుల మార్గదర్శనం, ఉత్సాహం , దృఢ సంకల్పాలే ముఖ్య కారణం. ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడింది ఈ మన యాత్ర నిరంతరంగా నిరాఘాటంగా సాగాలని కోరుకుంటున్నాను ఇంకా మరి ఎన్నో సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ అందులో భాగంగా భద్రాచలంలో రామదాసు గారి శతజయంతి ఉత్సవాలలో ఆ రాముని సమక్షంలో నవరత్న కీర్తనలు గానం చేసే అద్భుత అవకాశాన్ని మాకు అందరికీ ప్రతి సంవత్సరం కల్పిస్తున్నారు. శృతి రాగ లయలను బోధించి సంగీతం మీద మాకు మక్కువను కలిగించిన గురువుగారు నిజముగా మాకు దొరికిన పెద్ద వరముల మేము భావిస్తున్నాము పునర్వసు, రోహిణి, శ్రవణా నక్షత్రాల బృందగానాలతో పాటు ప్రతి నెలమాస శివరాత్రి రోజు భగవద్గీత , దక్షిణామూర్తి స్తోత్రాలు పారాయణం చేయడం జరుగుతుంది నవరత్న కీర్తనలు పంచరత్న కీర్తనలు బృంద గానాలతో కళకళలాడే శివాలయం లోగిలి గత ఎనిమిది సంవత్సరాలుగా రమనీయంగా సాగిపోతుంది. ముందు ముందు మా సాధన ఇంకా బాగా కొనసాగాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాను. సంగీతం అనగానే శ్రావ్యంగా పాడి శ్రోతలకు ఆనందం కలిగించడం దాని యొక్క ముఖ్య ఉద్దేశం . వయసుతో నిమిత్తం లేకుండా 20 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాలు వారికి కూడా సంగీత జ్ఞానాన్ని ఉచితంగా ఎలాంటి విసుగు లేకుండా చిరునవ్వుతో ఓపికతో శిక్షణ ఇస్తూ వారిని ఒక్కొక్క మెట్టు పైకి తీసుకొస్తున్నారు ప్రతి ఒక్క పాటకు అర్థం చెబుతూ చిట్టి చిట్టి కథలు చెబుతూ నేర్పిస్తారు. రెండు సంవత్సరం కూడా ఈ గురువుగారికి శిష్యులు, గురువుగారి పాటలు వింటూ పాడడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కఠినమైన శ్లోకాలు చదివే బదులు హాయిగా కూర్చుని దేవుని పాటలు పాడిన చాలు అంతే పుణ్యం వస్తుంది అని అంటారు. అయిదారు మందితో మొదలుపెట్టి ఈరోజుకి 100మంది సభ్యులతో విస్తరించింది, గురువుగారు కష్టపడి మ అందర్నీ ఉత్సాహపరిచి నేర్పిన భక్తికీర్తనలు నిరంతరము భగవత్



చింతనకు ఉపయోగించుకొని కృతకృత్యులం అగుటకు భగవత్ స్వరూపు లైన గురువు ఆశీస్సులు మా అందరిపై ఉండాలని ఆశిస్తూ మీ శిష్యురాలు అనిత కొత్తూరి.

## శీరంశెట్టి సాంబయ్య మృతదేహంపై పూల మాల వేసి నివాళులు అర్పించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట తెలంగాణ సేన :** నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు శీరంశెట్టి రాజేందర్ పెరక తండ్రి సాంబయ్య అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మరణించగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ నాయకులు మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్ లు సాంబయ్య మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, బీసీ నాయకులు మర్రి క్రాంతి కుమార్, శీరంశెట్టి రాజు లు పాల్గొన్నారు.

## స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు







**ముషీరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** ఉపాధ్యాయుల దినోత్సవ పురస్కారాలు సందర్భంగా స్కై ఫౌండషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, సన్మానం చేసి సర్టిఫికెట్స్, మెమొంటోస్ అందించాము. తల్లి తర్వాత తల్లిలా చిన్నారుల ఆలనా, పాలన చేసే సేవలు చాల అద్భుతం. అనేక కష్టాలను ఓర్చుకొని, అన్నిటికి ఓర్పుగా సేవలు అందిస్తున్న మమ్మల్ని ఎవ్వరు గుర్తించకున్నా, స్కై ఫౌండేషన్ సంస్థవాళ్ళు మేము కూడా ఉపాధ్యాయులమే అని గుర్తించడం అనేది మా జీవితంలో పొందలేని సంతోషాన్ని కలిగించి, సన్మానం చేయించుకోవడం , అవార్డు పొందడం మా జీవితాలలో ఒక మధుర స్మృతిగా నిలిచిపోయిందని అంగన్వాడీ ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్య నటులు గౌతమ్ రాజు గారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సభ్యులు అఖిల్. సాయి పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు అందజేసిన సీఎం

విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా

రైతులకు అండగా నిలువండి

నూతనంగా నియామకమైన గ్రామ

పాలన అధికారులకు, సీఎం పిలుపు



**తెలంగాణ సేన :** గత గులాబీ ప్రభుత్వంలో వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థలు రద్దుచేసి, వారిని వివిధ శాఖలోకి పంపారు. దీనివల్ల రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. దీనివల్ల అన్నదాతలకు సరైన రెవెన్యూ సేవలు అందడం లేదు, దీనిని దృష్టిలో పెట్టుకొని రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రాష్ట్రంలో రైతులకు, మరొకవైపు రెవెన్యూ కొరత తీర్చడానికి గ్రామ పరిపాలన అధికారులు నియమించడానికి సిద్ధమయ్యారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా తెలంగాణ రాష్ట్రంలో5,106 మందికి గ్రామ పరిపాలన అధికారులుగా నియామక పత్రాలు అందజేశారు. ధరణి పోర్టులో జరిగిన అవకతవకలను వెలుగులోకి తీసుకువచ్చి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలంటూ గ్రామ పరిపాలన అధికారులకు వేదిక సాక్షిగా పిలుపునిచ్చారు. ఇక్కడ కూడా అవినీతికి చోటు కల్పించకుండా, రైతులకు అండగా ఉండాలంటూ గ్రామ పరిపాలన అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా, మన ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండాగ్రామ పరిపాలన అధికారులు చక్కని పాలన అందించాలని సీఎం కోరారు. ఈ నియామక పత్రాలు కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభాపతి ప్రసాద్ కుమార్, మంత్రి సీతక్క ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు

## భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది



**వేములవాడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ సేన) :** భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో భారత ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ గారు నిత్యావసర వస్తువుల పై %+టూ% భారాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ వేములవాడ మండల కేంద్రంలోని కోరుట్ల బస్టాండులో భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో అగ్రస్థానానికి అడుగులు వేస్తున్న ఈ తరుణంలో అగ్రరాజ్యమైన అమెరికా భారత దేశ ఎదుగుదలను ఓర్వక భారత దిగుమతులపై పన్ను శాతం పెంచుతూ మన ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేస్తున్న పరిస్థితుల్లో కూడా నరేంద్ర మోడీ గారు పేద మరియు మధ్యతరగతి ప్రజల శ్రేయస్సు కోసం %+టూ% పన్ను ను మరింత తక్కువ చేయడం శుభ పరిణామం అన్నారు అదేవిధంగా దేశ ప్రజలు స్వదేశీ వస్తూ వినియోగం చేయాలని తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్ ప్రధాన కార్యదర్శి తోట శేఖర్ వనపర్తి పరశురాములుమండల ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య కార్యదర్శులు మంద రాజేందర్ శక్తి కేంద్రం ఇంచార్జ్ ఉప్పుల గౌతమ్ చింతకుంట గౌతమ్ బూత్ అధ్యక్షులు ఆది జలంధర్ సింగర వేణి హరీష్ చొప్పరి కరుణాకర్ ముష్కం సంజీవ్ సీనియర్ నాయకులు ఆవునురి తిరుపతి గుండెల్లి వేణుగోపాల్ జంగిటి శ్రీనివాస్ దుద్దేటి వర్ధన్ మందా నిశాంత్ జయారపు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జన వేడుకలు

పరిశీలించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

గుడి చెరువులో నిమజ్జన ప్రక్రియను బోటులో వెళ్లి పరిశీలించిన విప్, కలెక్టర్, ఎస్పీ



**వేములవాడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ సేన) :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడలో గురువారం వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా కొనసాగాయి . వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్రను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి పరిశీలించారు. అలాగే గుడి చెరువులో నిమజ్జన ప్రక్రియను విప్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అనంతరం వినాయకుడికి పూజలు చేశారు. నిమజ్జన స్థలం వద్ద అధికారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల భక్తి గీతాలు, ఇతర కళాకారుల మ్యాజిక్ షో భక్తులను అలరించింది. పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆర్డీవో రాధాబాయి, తహసిల్దార్ విజయ్ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



**తెలంగాణ సేన :** ఉపాధ్యాయిల దినోత్సవం సందర్భంగా గజ్వేల్ శ్రీ వెంకటేశ్వర స్వామీ ఆలయ విగ్నేశ్వర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ యాదవరెడ్డి తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి చేతుల మీదుగా ఉపాధ్యాయులు వేమరెడ్డి, రామకృష్ణ సంగీత,బిక్షపతి, పోచయ్య శ్రీనివాస్ గాలయ్య, శ్రీనివాస్ చంద్ర శేఖర్ లావణ్య, వింద్యారాణి సాహితి , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించి మెమొంటో అందజేసి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, విగ్నేశ్వర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియు ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**తెలంగాణ సేన :** పి ఆర్ టి యు గజ్వేల్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంటేరు సత్యనారాయణరెడ్డి, తీగుల్ల లింగం గౌడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎండి కరీముద్దీన్, ఏ సుగుణాకర్ ,భాస్కర్ బసవరాజ్, సుధాకర్ రెడ్డి శ్రీశైలం ,ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు గొప్ప మేధావి, తత్వవేత్త అని, ఉపాధ్యాయ వృత్తి నుండి దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి చేపట్టిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో ఉపాధ్యాయుల వృత్తి గౌరవప్రదమైనదని, సమాజం లో వచ్చే మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్పును కోరుకుంటూ విద్యార్థుల యొక్క భవిష్యత్తుకు పునాదులు వేయాలని తెలియజేశారు. సన్మానం పొందిన వారిలో సుధాకర్ రెడ్డి, శ్రీశైలం, బాలమణి గఫార్, ప్రవీణ్ కుమార్, హనుమంత రెడ్డి కనీజ్ ఫాతిమా, ఉన్నారు.

## వినాయకుని లడ్డు సొంతం చేసుకున్న కుంజ కుసుమాంజలి సూర్య



**కొత్తగూడ తెలంగాణ సేన :** మండల కేంద్రంలోని జవహర్లాల్ నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నవరాత్రులు పూజలు అందుకున్న గణపతి లడ్డూను %జీూచీజ% చివరి రోజైన శుక్రవారం రోజున వేలంపాట నిర్వహించగా చెవ్వ రామచందర్, బండి రాజమౌళి, జిమ్మిడి శ్రీనివాస్ కుంజ కుసుమాంజలి సూర్య లు వేలం పాటలో పాల్గొన్నారు. హోరహోరిగా సాగిన వేలం పాటలో రాష్ట్ర రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోడలు కుంజ కూసుమాంజలి సూర్య 41 000 పాట పాడి %జీూచీజ% లడ్డు ను కైవసం చేసుకున్నారు. దీంతో స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జే ఎల్ ఎన్ వై సి అధ్యక్షులు మల్లెల రణధీర్, ఉపాధ్యక్షులు యాదగిరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొట్టె శ్రీనివాస్, కోశాధికారి హలవత్ సుమన్, సంస్కృతిక కార్యదర్శి వజ్జ రాహుల్,కంగాల నాగేశ్వర్ రావు, ఇరుప రాజేశ్వర్,పరుశరాములు, కొట్టె విజయ్,ఇరుప చందు, ఏంపల్లి కృష్ణ, దోనాల లక్ష్మీనారాయణ,రంజిత్,కార్తీక్, సునీల్,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 06 - 09 - 2025

# వినాయక నిమజ్జనం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు



నవరాత్రులు పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య.. ఇక గంగమ్మ ఒడిచేరనున్నాడు. ఖైతరాబాద్ మహాగణపతి సహా హైరదాబాద్ వ్యాప్తంగా ఉన్న గణనాథులు ట్యాంక్‌బండ్, సరూర్‌నగర్ చెరువు, జీహెచ్ఎంసీ పరిధిలోని పలు చెరువుల్లో నిమజ్జనం కానున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు హైదరాబాద్‌లో గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరుగనుంది. దీంతో నగరంలోనిపలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాన నిమజ్జనరూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగానిలిపివేస్తా మన్నా రు. ఈనేప థ్యంలో వాహనదారులు ప్రత్యా మ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచి ం చారు. బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయి. టప్పచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్‌లోకి మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు ఈస్ట్ జోన్ కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు మళ్లింపులు ఉంటాయి. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుశ్షిఫా ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ ప్రాంతాలలో ఆంక్షలు అమలులో ఉంటాయి. లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లలో వాహనాలను అనుమతించరు. నిమజ్జనానికి వచ్చే వాహనాల కోసం ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుక, ఆదర్శనగర్, బీఆర్‌కే భవన్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ వద్ద పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత లారీలు నగరంలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మాత్రమే అనుమతిస్తారు. సెప్టెంబర్ 6న ఉదయం 8 నుంచి సెప్టెంబర్ 7న రాత్రి 11 వరకు నగరంలోకి లారీల ప్రవేశం ఉండదు. రద్దీ సమయంలో మెహిదీపట్నం, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, నారాయణగూడ వరకు మాత్రమే ఆర్టీసీ బస్సులను అనుమతిస్తారు. అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు దారి మళ్లిస్తారు. ఎంజే మార్కెట్, ఖైరతాబాద్, అబిడ్స్, లిబర్టీ, రాణిగంజ్, తెలుగు తల్లి చౌరస్తా, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా జంక్షన్లను దాటకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేవారు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఔటర్ రింగ్ రోడ్‌ను మాత్రమే ఉపయోగించాలని, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారు బేగంపేట-పారడైజ్ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఏదైనా సహాయం, సమాచారం కోసం ప్రజలు 040-27852482, 8712660600, 9010203626 నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు

# కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలి

**బీఆర్ఎస్ కీలక నేతలపై అసత్యారోపణలు**

**ఆమె వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీజేపీకే లబ్ధి**

**తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి**

**కవిత బహిష్కరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నం**

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెన్నంటే ఉంటాం**

**కవిత వైఖరితో జాగృతిలో పనిచేయం : మేడె**

**ఆమె వ్యాఖ్యలు రాజకీయ ద్రోహమే : భిక్షపతి**

**కవిత వ్యాఖ్యలు రేవంత్,బాబుకు ఊతం : రాజారాం**




'ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత గత ఆరు నెలలుగా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం మొదలుపెట్టారు. సొంత ఎజెండాతో పనిచేయసాగారు. 18 ఏండ్లుగా బీఆర్ఎస్ అనుబంధంగా ఉన్న తెలంగాణ జాగృతిలో భాగంగా ఆమె వెన్నంటి మేమంతా పనిచేశాం. ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత గత ఆరు నెలలుగా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం మొదలుపెట్టారు. సొంత ఎజెండాతో పనిచేయసాగారు. 18 ఏండ్లుగా బీఆర్ఎస్ అనుబంధంగా ఉన్న తెలంగాణ జాగృతిలో భాగంగా ఆమె వెన్నంటి మేమంతా పనిచేశాం. ఇప్పుడు ఆమె వైఖరితో ఏకీభవించలేకపోతున్నాం. ఆమె తన ఆలోచనను మాతో చర్చించనేలేదు. ఆమె వైఖరిని విభేదిస్తూ, ఇక నుంచి తెలంగాణ జాగృతిలో పనిచేయం. ఇప్పటికైనా కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలి' అని కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, తెలంగాణ జాగృతిలో కీలక నేతలు స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ తదితరులు మాట్లాడారు. కవిత వైఖరి మారిన నాటినుంచేఆమెకు దూరంగా ఉంటూ వస్తున్నామని మేడె రాజీవ్‌సాగర్ తెలిపారు. ఇక ముందు తెలంగాణ జాగృతిలోఉండదల్చుకోలేదని తెలి పారు. కవిత వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీజేపీ లబ్ధి పొందుతాయని తెలిపారు. 2006లో నాటి టీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా కవిత నేతృత్వంలో ఏర్పాటైన తెలంగాణ జాగృతిలో చేరి ఉద్యమ రథసారధి కేసీఆర్, కవిత ఇచ్చినప్రతిపిలుపునువిజ యవం తంగా నిర్వహించామని తెలిపారు. 2009లో కేసీఆర్ తెలంగాణ కోసం తన ప్రా ణాన్ని పణంగా పెట్టారని, పార్టీలో తన సొంతవారైనా క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటానని చెప్పారని, చెప్పిన మాటకు కట్టుబడి తాజాగా కవితపై తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్‌లో కీలక నేతలైన హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌పై కవిత చేసిన వ్యాఖ్యలు బాధ కలిగిస్తున్నాయని తెలిపారు. వారిపై కవిత చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. పనిచేసేవారిపై విమర్శలా : రాజారాంప్రతిపక్షంలో ఉండి ప్రజల కోసం పనిచేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావుపై కవిత విమర్శలు గుప్పించడం బాధాకరమని రాజారాంయాదవ్ పేర్కొన్నారు. స్వ రాష్ట్ర అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తరుణంలో, కవిత వ్యాఖ్యలు వారికే ఊతమిచ్చేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో కవి, రచయిత కే శ్రీనివాస్, అనంతుల ప్రశాంత్, ఉపేందర్‌రావు, శేఖర్, చందుయాదవ్, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు. తృర్థి పార్టీలకు ఊతం: భిక్షపతితెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాక్షస పాలన నడుస్తున్నదని, మళ్లీ కేసీఆర్ రావాలి, తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని, ఈ తరుణంలో కవిత వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీలకు ఊతమిచ్చేలా ఉన్నాయని మఠం భిక్షపతి తెలిపారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తున్నానని తెలిపారు. 18 సంవత్సరాలు ఆమె నాయకత్వంలో పనిచేశామని, కానీ తమ బాగోగుల కోసం ఆమె ఏం చేశారని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌పై కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీకి ద్రోహం చేయడమేనని విమర్శించారు. పార్టీ కార్యకర్తకైనా, సామాన్యుడికైనా ఏ సమస్య వచ్చినా వారు స్పందించడమే కాకుండా వారిని అన్ని విధాలుగా ఆదుకుంటూ వస్తున్నారని తెలిపారు

# వరదలోనూ బురద రాజకీయం!

**ఇద్దరు జిల్లా నేతల ఆధిపత్య పోరుతో**

**సీఎం టూర్‌లో మార్పు**

**నష్టపోయిన నాగిరెడ్డిపేట మండలంలో**

**పర్యటించని సీఎం**

**పోచారం ప్రాజెక్టును, పొలాలను**

**పరిశీలించకుండానే తిరుగుముఖం**

**సీనియర్ కాంగ్రెస్ నేత మంత్రాంగమే కారణమని**

**ఆరోపిస్తున్న ఎమ్మెల్యే వర్గీయులు**



కామారెడ్డి జిల్లాలోని వరద పీడిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం చేపట్టిన పర్యటన కాంగ్రెస్ పార్టీలోని ఆధిపత్య పోరును మరోసారి తెర మీదకు తెచ్చింది. కామారెడ్డి జిల్లాలోని వరద పీడిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం చేపట్టిన పర్యటన కాంగ్రెస్ పార్టీలోని ఆధిపత్య పోరును మరోసారి తెర మీదకు తెచ్చింది. జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ నేత ఆధిపత్య పోరుతో సీఎం షెడ్యూల్ మార్చుకోవాల్సి వచ్చిందనే చర్చ జరుగుతున్నది. గత వందేండ్లలో ఎన్నడూ లేనంతగా కురిసిన వర్షాలతో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం కకావికలమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం మోతే గ్రామంలోని ముంపు భూములను, లింగంపల్లి వద్ద దెబ్బతిన్న కుర్దు వంతెనను పరిశీలిస్తూ ఎల్లారెడ్డి మండలంలోకి ప్రవేశించాల్సి ఉన్నది. ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించి, బాధిత రైతులతో మాట్లాడాల్సి ఉన్నది. అనంతరం అదే నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలంలో తీవ్రంగా దెబ్బతిన్న పోచారం ప్రాజెక్టును సందర్శించి, అక్కడ బాధిత రైతులతో మాట్లాడాల్సి ఉన్నది. అనంతరం వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, పంటలు, చెరువులు, వాగుల పరిస్థితిపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించాల్సి ఉన్నది. ఇందుకోసం అధికారులు నాగిరెడ్డిపేట మండలం మాల్‌తుమ్మద శివారులోని పాలిటెక్నిక్ కాలేజీలో ఫొటో ఎగ్జిబిషన్ వేదికను ఏర్పాటుచేశారు. అక్కడే వరద నష్టం మీద సీఎం సమీక్షా సమావేశం నిర్వహించే విధంగా షెడ్యూల్ ఖరారైంది. మారిన షెడ్యూల్‌యితే, అనూహ్యంగా సీఎం పర్యటన షెడ్యూల్ మారింది. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన నాగిరెడ్డిపేట మండలంలో పర్యటించలేదు. మండలంలోని పోచారం ప్రాజెక్టును, పంట పొలాలను పరిశీలించకుండానే తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం పర్యటన షెడ్యూల్ మారడం వెనుక కాంగ్రెస్ పార్టీకే చెందిన ఒక సీనియర్ నేత హస్తం ఉన్నదని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం ఒకప్పుడు సదరు సీనియర్ నేత ఆధిపత్యంలో ఉండేది. గతంలో ఆయన ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన్ను పక్కనపెట్టి కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పుడున్న నేతకు టికెట్ ఇచ్చింది. అప్పటినుంచే ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెప్తున్నారు. ఆ ఆధిపత్య పోరులో భాగంగానే సీనియర్ నేత రంగప్రవేశం చేసి రాత్రికి రాత్రే సీఎం షెడ్యూల్‌ను మార్పించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఒక్క నియోజకవర్గంలోనే పర్యటించి పోతే తాము తలెత్తుకోలేమని, జిల్లాపై తన ఆధిపత్యం పోతుందని, పైగా అతను మీ కంటే (సీఎంతో) ఓ సీనియర్ మంత్రికి అతిసన్నిహితంగా ఉంటారని చెప్పి సీఎం మీద ఒత్తిడి చేసినట్టు స్థానిక కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. వరదలో కూడా ఇదేం బురద రాజకీయాలు అని అక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేసి దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, మౌలిక వసతులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు

# వరద పర్యటనలో నిర్బంధం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద పర్యటనలో బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం కొనసాగింది. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద పర్యటనలో బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం కొనసాగింది. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బీఆర్ఎస్ నేతల నిర్బంధాల మధ్యనే సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి జిల్లాలో వరద పర్యటన కొనసాగింది. హెలికాప్టర్ ద్వారా గురువారం కామారెడ్డి జిల్లాకు వచ్చిన సీఎంరేవంత్‌రెడ్డిరోడుమార్గంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట, కుర్దూ గ్రామాల్లో ఇటీవల వరదలో కొట్టుకు పోయిన బ్రిడ్జిని, ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించి రైతులతో ముచ్చటించారు. అనంతరం కామారెడ్డి పట్టణంలోని జీఆర్, హౌసింగ్ బోర్డు కాలనీలను సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. వరదతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాను ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ తరహాలో ఇక్కడా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. తెగిన రోడ్లు, చెరువులు మరమ్మతులు చేస్తామని, ఇండ్లు నష్టపోయిన వారికి హౌసింగ్ స్కీం ద్వారా ఫ్లడ్ డ్యామేజీలో అదనంగా ఇండ్ల కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వరదలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో జరిగిన నష్టానికి శాశ్వత మరమ్మతుల కోసం అంచనాలను సిద్ధం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తాత్కాలికంగా సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్‌కు ఆదేశాలు

స ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా వెలివెన్నుకు చెందిన శశి విద్యాసంస్థల యాజమాన్యం



రూ. 1.01కోట్ల భారీ విరాళాన్ని వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు సమర్పించింది. హైదరాబాద్, ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా వెలివెన్నుకు చెందిన శశి విద్యాసంస్థల యాజమాన్యం రూ. 1.01కోట్ల భారీ విరాళాన్ని వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు సమర్పించింది. ఈ మేరకు శశి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ పార్ట్‌నర్ రవికుమార్ బురుగుపల్లి సంస్థ తరపున విరాళం డీడీని అందించారు

# కాణిపాకం వినాయకుడికి పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ చైర్మన్



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం టీటీడీ తరుపున చైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం టీటీడీ తరుపున చైర్మన్ బీఆర్ నాయుడు ( చీపట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకంలో తిరుకల్యాణం సందర్భంగా టీటీడీ ప్రతి ఏడాది పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న చైర్మన్ కు ఆలయ ఈవో పెంచెల కిషోర్ కుమార్, ఏఈవో రవీంద్ర బాబు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణం చేసి గర్భాలయంలో స్వామివారికి వస్త్ర సమర్పణ చేశారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బొక్కసం ఇన్‌చార్జి గురురాజ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు

# టీటీడీకి రూ.1.01 కోట్లు విరాళం అందజేత



కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల వేంకటేశ్వరస్వామికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ భక్తుడు భారీ విరాళనాన్ని అందజేశారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల వేంకటేశ్వరస్వామికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ భక్తుడు భారీ విరాళనాన్ని అందజేశారు. వెలివెన్నుకు చెందిన శశి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ మేనేజింగ్ పార్టనర్ రవికుమార్ బురుగుపల్లి అనే భక్తుడు, సంస్థ తరపున, గురువారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ. 1.01 కోట్లు విరాళంగాఅందించారు. ఈ మేరకు విరాళం డీడీని తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్. నాయుడుకు అందజేశారు. శ్రీవారి హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయంతిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 70,472 మంది భక్తులు దర్శించుకోగా 25,247 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా స్వామివారి హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

# తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లేవారికి గుడ్‌న్యూస్.. ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!



దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. రాబోయే దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు పేర్కొంది. చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నవంబర్ వరకు పొడిగినట్లు చెప్పింది. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. రాబోయే దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు పేర్కొంది. చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నవంబర్ వరకు పొడిగినట్లు చెప్పింది. చర్లపల్లి-తిరుపతి (07013) రైలు సెప్టెంబర్ 9 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం రాకపోకలు సాగిస్తుందని తెలిపింది. రైలు ఆయా రోజుల్లో రాత్రి 9.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. తిరుపతి-చర్లపల్లి (07014) రైలు సెప్టెంబర్ 10 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని.. ఆయా రోజుల్లో సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని వివరించింది. రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్, కంభం, గిద్దలూరు, నంద్యాల, కోయికంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూర్, యెర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూర్, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్లలో రైలు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లు ఉన్నాయని.. అడ్వాన్స్ టికెట్స్ బుక్ చేసుకోవచ్చని వివరించింది

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 06 - 09 - 2025

### రాత్రి పూట డిన్నర్ చేశాక వాకింగ్

# చేస్తే ఎన్నో అద్భుతమైన ఫలితాలు



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే వ్యాయామం అంటే మరీ కష్టపడి జిమ్‌లలో కసరత్తులు చేయాల్సిన పనిలేదు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు సాధారణ వాకింగ్ చేసినా చాలు. ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం వాకింగ్ చేయడం వల్ల రోజంతా మెటబాలిజం ఎక్కువగా ఉంటుంది. ఇది క్యాలరీలను కరిగిస్తూనే ఉంటుంది. కనుకనే ఉదయం వ్యాయామం చేయాలని వైద్యులు చెబుతుంటారు. అయితే కేవలం ఉదయం మాత్రమే కాదు.. రాత్రి పూట భోజనం అనంతరం కూడా వాకింగ్ చేయాలి. దీంతో మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయడం ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

**అధిక బరువు, షుగర్ లెవల్స్..**

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కనీసం 10 నిమిషాల పాటు తేలికపాటి నడక కొనసాగించాలి. రాత్రి పూట మన మెటబాలిజం తగ్గుతుంది. కానీ వాకింగ్ చేస్తే మెటబాలిజంను పెంచుకోవచ్చు. దీంతో రాత్రి మనం నిద్రించినా కూడా మన శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తూనే ఉంటుంది. ఫలితంగా మనం నిద్రలో ఉన్నా కూడా మన శరీరంలోని కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట డిన్నర్ తరువాత వాకింగ్ చేస్తే ఎన్నో మంచి ఫలితాలను పొందవచ్చు. ఇక రాత్రి పూట భోజనం అనంతరం వాకింగ్ చేయడం వల్ల షుగర్ లెవల్స్‌న అదుపులో ఉంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాత్రి డిన్నర్ తరువాత వాకింగ్ చేసేవారి ఫాస్టింగ్ షుగర్ లెవల్స్ చాలా వరకు తగ్గాయని తేల్చారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ షుగర్ లెవల్స్‌ను తగ్గించుకునేందుకు గాను రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.

**కొలెస్ట్రాల్ లెవల్స్..**

కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా ఉన్నవారు రోజూ కచ్చితమైన డైట్‌ను పాటిస్తూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అప్పుడే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అయితే రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు రోజూ రాత్రి వాకింగ్ చేస్తే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే రోజూ రాత్రి వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని, కడుపు ఉబ్బరంగా ఉంటుందని భావించే వారు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేస్తే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

సాధారణంగా భోజనం చేసిన వెంటనే శరీరంలో రక్త సరఫరా మొత్తం జీర్ణాశయం వైప చేరుతుంది. కానీ రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. బీపీ ఉన్నవారు రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రాత్రి డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. రాత్రి వాకింగ్ చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మీరు యజమానా? వాచ్ మ్యానా?

దైనందిన జీవితంలో సత్యం అనిపించిన ఎన్నో విషయాలు ఆర్థిక సూత్రాల్లో అంతగా ఇమడవు! ఓ మధ్యతరగతి మనిషికి పొదుపు అంటే%ౌ% ఖర్చులు తగ్గించుకోవడం వరకే ఆలోచిస్తాడు. మదుపు అంటే ప్రైవేటుగా చిట్స్ వేసి.. ధర్మవడ్డీకి తిప్పడమనే తెలుసు!! ముచ్చటపడి కట్టుకున్న ఇంట్లో మురిపెంగా ఉండాలని ఉన్నా.. ఇంకేదో ఆశిస్తాడు. రూపాయి, రూపాయి కూడబెట్టి ఇల్లు మీద ఇల్లు కట్టి.. యజమానిగా చెలామణీ కావాలని ఆశిస్తాడు. ఈ రకంగా ఆలోచించిన ఎందరో.. యజమానులుగా కన్నా, జీతం భత్యం లేని వాచ్‌మెన్లుగా మిగిలిపోతున్నారు. ఏ పెట్టుబడి అయినా మనల్ని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేదై ఉండాలి. కానీ, ఆ పెట్టుబడే గుదిబండగా మారితే.. ఆశించిన లాభాలు రావు సరికదా, తలకు మించిన భారంగా పరిణమిస్తుంది. నడివయసులోనే సొంతింటి కలను నిజం చేసుకున్న వారు నిజంగా అదృష్టవంతులే! దానికి తృప్తిచెంది.. ఇతర పెట్టుబడుల గురించి ఆలోచిస్తే మేలైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు. కానీ, చాలామంది మూసపద్ధతికి అలవాటుపడినవాళ్లే ఉంటారు. వాళ్లు చేసే తప్పులు ఎలా ఉంటాయో పరశురామ్ కథ చదివితే అర్థమవుతుంది. పరశురామ్ ప్రైవేట్ ఉద్యోగి. మంచి జీతం వస్తుంది. ఊళ్లో కొద్దోగొప్పో ఆస్తి ఉంది. భార్య, ఇద్దరు పిల్లలు. జీవితం ఉన్నంతలో రిచ్‌గానే సాగిపోతుంది. పిల్లలు బడి వయసు దాటి కాలేజీలోకి ప్రవేశించారు. ఒకరోజు పరశురామ్ అత్తామామ ఊడిపడ్డారు. అత్తగారేమో తన కూతురుతో వంటింట్లో సొంతిళ్లు సొద మొదలుపెట్టింది. మామగారేమో అల్లుడితో అదే విషయాన్ని తన అనుభవాన్నంతా రంగరించి చెప్పనారంభించాడు. ‘అల్లుడుగారూ! కూడబెట్టిన సొమ్ముతో మంచి స్థలం తీసుకోండి. మంచి బిల్డర్‌కు ఇచ్చి లోను మీద ఇల్లు కట్టుకోవచ్చు. మూడంతస్తులు వేసి.. పై పోర్షన్‌లో మీరు ఉండి, మిగతావి అద్దెకిస్తే.. తిని కూర్చోవచ్చు! ఏమంటారు?’ అన్నాడు. మామగారి ఆలోచన సబబుగానే తోచింది పరశురామ్‌కు. తల్లి బోధతో అతని భార్య కూడా ఆలోచించండి అన్నట్టుగా చూసింది.

**కోరికలు.. ఫిర్యాదులు..**

ఇల్లు కట్టాలని ఫిక్సయిన పరశురామ్ అప్పటి వరకు తను కూడబెట్టుకున్న డబ్బంతా వెలికితీశాడు. ఈపీఎఫ్‌లో ఉన్న మొత్తాన్ని తీసుకున్నాడు. కొంత బంగారం కుదువపెట్టాడు. వెంచర్‌లో చిన్న స్థలాన్ని అమ్మేసి రూ.కోటి సర్దుబాటు చేసుకున్నాడు. ఆ మొత్తంతో నగర శివారులో 220 గజాల స్థలం కొన్నాడు. బిల్డర్‌ను సంప్రదిస్తే మరో కోటితో జీం2తోపాటు పైన పెంట్‌హౌజ్ నిర్మించేలా ఒప్పందం చేసుకున్నాడు. బ్యాంకులో రూ.1.20 కోట్లు గృహరుణం తీసుకున్నాడు. అప్పటికే 45 ఏండ్లు ఉండటంతో, లోను టెన్యూర్ 15 ఏండ్లు పెట్టుకున్నాడు. ఈఎమ్ఐ రూ.1.20 లక్షలుగా ఫిక్సయింది. అంటే అతని జీతంలో సగం వాయిదాకు చెల్లించాలని ఫిక్సయ్యాడు! ఇల్లు పూర్తయింది. ఆరు పోర్షన్లు అద్దెకిస్తే నెల తిరిగేసరికి రూ.60వేలు వసూలు అవుతున్నాయి. పరశురామ్ ఆనందానికి అవధుల్లేవ్. మూడు నెలలు గడిచాయో లేదో.. అద్దెదారులు పరస్పరం గొడవలకు దిగడం, తీర్పు కోసం పరశురామ్ తలుపు తట్టడం కామన్ అయిపోయింది. తప్పు చేసిన వారిని ఇల్లు ఖాళీ చేయించడమో, అలా చేయలేకపోతే తమదే ఒప్పు అనుకున్న వాళ్లు మరో ఇంటికి మకాం మార్చడమో జరుగుతూ వచ్చింది. ఆరు పోర్షన్లలో ఎప్పుడూ రెండు ఖాళీగానే ఉంటున్నాయి. ఇది చాలదన్నట్టు.. నీళ్లు రావడం లేదనీ, కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నదనీ, మంచి నీళు పైకి వచ్చేలా ఏర్పాటు చేయమనీ, వాష్‌రూమ్‌లో నీళ్లు పోవడం లేదనీ.. ఇలా రోజుకో ఫిర్యాదు రావడం మొదలైంది. వాళ్ల కోరికలు మన్నించలేక, ఫిర్యాదులు పరిష్కరించలేక.. పరశురామ్‌కు సొంతింట్లో ఉంటున్న ఆనందం రెండేండ్లకే ఆవిరైంది. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు. స్పష్టంగా చెప్పాలంటే.. రెండు కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసిన యజమాని కాస్త ఆ ఇంటికి వాచ్‌మ్యాన్‌గా మారిపోయాడు. ఇప్పుడు మీరు ఆలోచించండి.. రూ.2.20 కోట్ల పెట్టుబడి పెట్టి.. ఇల్లు తీసుకున్న వ్యక్తి దర్జాగా బతక్కుండా, ఇలా నీరుగారిపోవడాన్ని ఏ ఆర్థిక సూత్రం మాత్రం ఆమోదిస్తుంది. ఇదే పరశురామ్ రూ.కోటితో ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌గానీ, అదే నగర శివారులో డూప్లెక్స్ ఇల్లు గానీ తీసుకుంటే.. ‘అనుభవించు రాజా!’ అని పాడుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేసేవాడు. తానొకటి తలస్తే విధి మరొకటి తలచింది. శాశ్వత ఆదాయం మాయలోపడి జీవితంలో ప్రశాంతతకు దూరం అయ్యాడు. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు.



# పేరులోనే అంతా ఉంది




మార్పు శాశ్వతం అనే చమత్కారాన్ని మనం తరచూ వింటూనే ఉంటాం. తెలుగు సాహిత్యంలో ఈ మార్పును కవులు బాగానే ఒంటపట్టించుకున్నారు. ముఖ్యంగా తమ కవిత్వ సంకలనాల శీర్షికల విషయంలో ఈ మార్పు కనిపిస్తుంది. ఇంతకుముందు అంటే రెండు, మూడు దశాబ్దాల క్రితం అన్నమాట.. కవిత్వ సంకలనాలకు మూస టైటిళ్లు ఉండేవి. తాము రాసిన కవితల్లో ఓ కవిత పేరే సంకలనానికి పెట్టేవారు. ఇది ఇప్పుడూ కొనసాగుతోంది కానీ, ఆ కవితకు పెడుతున్న శీర్షికే కొత్తగా, ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా ఓ దశాబ్దం నుంచి కవుల్లో ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే మార్పు కోరిన తరంగా కనిపిస్తోంది. ‘ఒక వెళ్లిపోతాను’ అని ఎం.ఎస్.నాయుడు తన కవిత్వ సంకలనానికి అందులోని ఒక పద్యం పేరే పెడితే తెలుగు సాహిత్య లోకమంతా చాలా ఆశ్చర్య పోయింది. ఆ కవిత్వ సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి విమల అయితే, ఆ పేరు చూసి కవిత్వంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో అని ఆశ్చర్యచకితులయ్యారు. ఆ సభలోనే విమల మాట్లా డుతూ ఒక్క లైనులోనే ఓ కవితను చెబుతున్న వారూ ఉన్నారన్నారు. ఇదీ నేటి కవిత్వ భాష. ఇక ప్రసేన్ అయితే తన మూడు కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు చూసి ఆ కవిత్వం చదవాలనిపిస్తుంది. (కొనాలనిపిం చదు. కొట్టేసి చదవాలనిపిస్తుంది). ప్రసేన్‌కు జర్నలిస్టుగా అనుభవం ఎక్కువే కాబట్టి, అక్కడ హెడ్డిం గులు పెట్టినట్టే తన కవిత్వ సంకలనాలకు కొత్తకొత్త పేర్లు పెట్టి పాఠకులను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారా యన. అంటూ కార్పొరేట్ ప్రకటనలు వస్తున్నాయి కానీ, తెలుగు కవిత్వాన్ని మాత్రం ఆ కవర్ పేజీ, ముఖ్యంగా ఆ సంకలనానికి పెట్టిన పేరుని బట్టే చదువుతున్నారు. అంతేకాదు.. పుస్తక ప్రదర్శనల్లో కొంటున్నారు కూడా. ప్రసేన్ తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కొందరికి కొత్తగా అనిపిస్తే%ౌ% ఇంకొందరికి మాత్రం గమ్మత్తుగా అనిపించాయి. నాకు భలే నచ్చాయి ఆ పేర్లు. ప్రసేన్ రాసిన ఓ కవిత్వ సంకలనం పేరు ‘ఇంకా వుంది’. సృజనకారులకు ఎందులోనూ ముగింపు ఉండదు. కవి అనండి, రచయిత్రి కానివ్వండి ఏది రాసినా అంతా అసంపూర్ణమే. వాళ్లు చెప్పేందుకు ఇంకా చాలానే ఉం టుంది. బహుశా అందుకు సంకేతమే ఈ ‘ఇంకా వుంది’. ఇలాంటి తాత్వికతే మరో రెండు సంకలనాల టైటిళ్లలోనూ కనిపిస్తుంది. అందులో ఒకటి ‘ఎవరికి వర్తి స్తే వారికి’. ఈ కవిత్వం చదవడానికి కాసింత ధైర్యం కావాలనిపిస్తుంది. ఆ సంకలనం తెరిస్తే ‘మన గురించి, మనల్ని ఉద్దేశించి ఏమైనా రాశారా, మనల్ని మన అద్దం లో చూపించారా!? లేదా తన అద్దంలో చూపిం చారా!?’ అనే సంశయం ప్రారంభమవుతుంది. ఏది కనిపించినా అది ఎవరికి వర్తిస్తే వారికి అలా సీనియర్ కవిగా గుర్తింపు పొందిన జూకంటి జగన్నా థం తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఉంటాయి, బాగుం టాయి. ఈ మధ్య ఖమ్మం ఈస్థటిక్స్‌వారు ఉత్తమ కవిత్వ సంకలనంగా జూకంటి రాసిన ‘ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్ లు’కే ప్రకటించారు. ఈ సంకలనానికి అవార్డు ప్రకటించారని తెలియగానే తొలు త ఆశ్చర్యపోయాను. జూకంటి ఇప్పటి కవి కాదు. ఇంతకుముందు కూడా తన కవిత్వ సంపుటాలకు ‘ఇండియా ప్రైవేట్ లిమిటెడ్’ అని, ‘వాస్కో డిగామా డాట్‌కామ్’ అని సరికొత్త పేర్లు పెట్టారాయన. అంటే నేటి తరంతో నాటి జూకంటి అప్‌డేట్ అవుతు న్నారనిపించింది. ఊరికే పేరేనా లోపల విషయం ఉందా అని చూస్తే చాలానే ఉందనిపిస్తుంది. ఈ కప్పు చాయ్ పద్యం ‘వన్నెల వెన్నెలని చూడలేదు/ ఉదార హృదయాన్ని కనలేదు’ అంటూ ప్రారంభమై మధ్యలో ‘ఏమరుపాటుగా కుర్చీలో కూర్చుని/ ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ/ సెల్‌లో ఎంగిలి మెసేజ్‌లు చదువుతూ/ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం/ కాకిలగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు’ అంటారు. ఎంత గొప్పగా వెటకరించారు సెల్‌ఫోన్‌లే లోకంగా బతుకుతున్న నేటితరాన్ని. కవులే కాదు.. కవయిత్రులు కూడా తమ సంకలనాలకు సరికొత్త పేర్లు పెడుతూ పాఠకులకు చేరువవుతున్నారు. తోట సుభాషిణి ‘ఒకటి ఒకటి పదకొండు’, మందరపు హైమావతి ‘రాతిచెయ్యి’ కవిత్వ సంకలనాలు తీసుకొచ్చారు. తన కవిత్వ సంకల నాలకు ‘లోహనది’, ‘మరో దశ’ వంటి సీరియస్ పేర్లు పెట్టిన వసీరా మూడో సంకలనానికి మాత్రం ‘సెల్ఫీ’ అని నామకరణం చేశారు. ఇది తన మూడు దశాబ్దాల కవిత్వ ప్రయాణంలో తానే తీసుకున్న సెల్ఫీ. ఎప్పుడూ అచ్చమైన కవిత్వం రాసే పసునూరి శ్రీధర్‌బాబు ‘నిద్రపోని మెలకువ చెప్పిన కల’ అంటూ పొయెటిక్ సంకల్పం చెప్పుకొన్నారు తన కొత్త కవిత్వానికి. తెలుగు సాహిత్యంలో చాలామందికి గురుస్థానంలోకి వచ్చిన సీనియర్ కవి శివారెడ్డి అయితే పొసగనివన్నీ కలిపి ఓ కవిత్వ సంకలనం వేశారు. అది కూడా దశాబ్దంన్నర క్రితమే. అలాగే ‘పక్కకు వొత్తిగిల్లితే’ ఏం జరుగుతుందో కూడా శివారెడ్డే చెప్పారు. ఎనిమిది పదుల వయసులోకి వచ్చాక అసలు సిసలు ప్రేమని కనుగొని దానికి ‘%ూంవ ్శీ శాశీఙవ% అను ప్రేమగీతం’ పాడారు. ఇంకా చాలామంది తమ కొత్త శీర్షికలు, కవిత్వ సంకలనాల పేర్లతో తెలుగు కవిత్వాన్ని వినిపిస్తున్నారు. ‘పేరులోన ఏముంది’ అన్నమాట కాదు నేడు వినిపిస్తున్నది.. ‘పేరులోనే అంతా ఉంది’ అన్నదే నేడు వినిపిస్తున్న కవిత్వం.

# ఆత్మ నివేదన

గత 127 వారాలుగా ‘కాశీమజిలీ కథలు’ అనుసృజనను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు. 1930వ దశకంలో 12 భాగాలుగా మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల విశిష్టతను గురించి, ఈ అనుసృజనలో ఆ కథలను చెప్పేందుకు అనుసరించిన నిబంధనలను గురించి క్లుప్తంగా తెలియచేస్తూ.. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. తెలుగులో కాశీమజిలీ కథలకున్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. సంసార వ్యామోహాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన మణిసిద్ధుడు అనే యతి.. కాశీయాత్ర చేయాలని నిశ్చయించుకుంటాడు. అయితే యాత్రలకు ఒంటరిగా వెళ్లరాదనే నియమాన్ని పురస్కరించుకుని, తనకు తోడుగా రమ్మని ఒక గోపాలకుణ్ని కోరుతాడు. కథలంటే మక్కువ కలిగిన ఆ గోపాలకుడు.. ‘దారిలో కనిపించే విశేషాలన్నిటినీ నాకు విడమరిచి చెబితేనే మీతో వస్తా!’ అని షరతు పెట్టాడు. మణిసిద్ధుని వద్ద ఒక అపురూపమైన మణి ఉంది. దాని సాయంతో దారిలో కనిపించిన ప్రతి విశేషాన్ని తెలుసుకుని, ఎప్పటికప్పుడు మణిసిద్ధుడు ఆ గోపాలకుడికి కథలు కథలుగా చెబుతాడు. అవే కాశీ మజిలీ కథలు. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షిత కవి రచించిన కాశీమజిలీ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా, పండిత పామరులనే భేదం లేకుండా.. ఒకప్పుడు తెలుగు వారందరూ కాశీమజిలీ కథలను ఆస్వాదించినవారే! పూర్తి జానపద శైలితో సాగినప్పటికీ, సామాన్యులకు అంతగా రుచించని వేదాంత, వ్యాకరణాది అంశాలను పరమార్థ బోధారూపంగా అందించిన అద్వితీయ రచన కాశీమజిలీ కథలు. మధిర సుబ్బన్న దీక్షితులు ఈ కథలను రచించేనాటికి తెలుగులో నవలలు లేవు. చిన్నవైనా, పెద్దవైనా కథలు మాత్రమే! కాశీమజిలీ కథల్లో 359 మజిలీలు ఉంటాయి. ఆ మజిలీలన్నిటిలో ‘కథ’ అనే పేరు కనిపిస్తుంది. లెక్కకు మిక్కిలిగా కథలుంటాయి. ఉదాహరణకు మొదటి సంపుటంలో వరప్రసాదుల కథ ఉంటుంది. ఇది అయిదుగురు స్నేహితుల కథ. ప్రధాన కథ ఇదే అయినప్పటికీ.. వేర్వేరు శీర్షికలకు కూడా కథ అనే పేరుతోనే పేర్కొన్నారు. ఈ అనుసృజనలో ప్రతిభాగానికీ వేర్వేరు శీర్షికలను ఉంచినప్పటికీ ప్రధాన కథ ప్రారంభాన్ని, ముగింపునీ తప్పనిసరిగా తెలియచేశాం. ఆవిధంగా చూస్తే ఇప్పటివరకు 28 కథలను మీరు చదివారు. ఇంకా మిగిలిన కథలేమయ్యాయి?! వాటిని ఎందుకు చెప్పలేదు!? అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా స్మరించాల్సి ఉంది. కాశీమజిలీల్లో ప్రధాన కథ ఎప్పుడూ మణిసిద్ధుడనే యతి.. గోపాలకుడనే సహాయకుడికి బోధించినట్లుగా మొదలవుతుంది. కథలో చర్చించబోయే విషయాన్ని నాటకఫక్కీలో ముందుగా వారిద్దరి మాటల్లో చర్చించారు. అయితే ఈ అనుసృజనలో వారిద్దరి పాత్రలనూ పక్కన పెట్టినప్పటికీ అసలు స్మరించకుండా ఉండలేదు. ఇక, వరప్రసాదుల కథలోనే కృష్ణదేవరాయల వృత్తాంతం ఇమిడి ఉంటుంది. కృష్ణరాయని కథను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దిన రచయిత, అందులోనే తిమ్మరుసు కథ, గజపతులతో సంబంధం వగైరా కథలను హేతుబద్ధంగానూ, చరిత్రకు అందే విధంగానూ రచించారు. అయినప్పటికీ ఈ అనుసృజనలో చారిత్రక పురుషులపై వచ్చిన కథలను తప్పించడం జరిగింది. కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితులు.. 1. జానపద ఇతివృత్తాలు, 2. చారిత్రక ఇతివృత్తాలు, 3. కావ్యకథలు, 4. పౌరాణిక కథలు అనే విభాగాల నుంచి స్వీకరించి రచించారు. ఇందులో ఇప్పటివరకు మనం జానపద ఇతివృత్తాలను మాత్రమే చదువుకున్నాం. కృష్ణరాయని కథతో పాటుగా.. జగన్నాథ పండితరాయలు, తెనాలి రామలింగడు వంటి చారిత్రక పురుషుల కథలను అప్పటి పండిత పామరులను రంజింపచేసే విధంగా సుబ్బన్న దీక్షితులు రచించారు. అవి ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి బాగుంటాయి. జనబాహుళ్యాన్ని కాస్త తికమక పెడతాయి. కనుకనే వాటిని విడిచిపెట్టడం జరిగింది. రెండో సంపుటంలో పూరీ జగన్నాథుని అవతార నేపథ్యానికి సంబంధించిన ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతాన్ని యథాతథంగా వర్ణించాం. 8వ సంపుటిలోని పౌరాణికమైన మదాలస కథను చెప్పాం. పురాణ పాత్రల నేపథ్యాలతో వచ్చిన మరికొన్ని కథలనూ చెప్పాం. విక్రమార్కుడు ఉట్టికోసిన కథ, భేతాళుని వశం చేసుకున్న కథ ఒక క్రమపద్ధతిలో లేవు. అవన్నీ ఇతరత్ర బహుళ ప్రాచుర్యంలో ఉన్నవే. కాశీమజిలీల్లోనివే అయిన విక్రమార్కుని మనుమని కథను చదువుకున్నాం. కానీ, అతను పాతాళానికి వెళ్లి విభీషణుడు మొదలైన రాక్షసులను కలుసుకోవడం వగైరా కథలను నేటితరం వారికి ఓ పట్టాన కొరుకుడు పడవు కనుక, విడిచిపెట్టాం. వీణావిద్వాంసుని కథ చాలా చిన్నదే కానీ, మజా కలిగించే కథ కాదు. నాలుగు కులాలకు చెందిన నలుగురు కన్యలు ఒకే వరుణ్ని వరించిన కథను కూడా ఈ శీర్షికలో చెప్పలేదు. 5వ సంపుటిలోని శంకరవిజయాన్ని ఈ అనుసృజనకారుడు గతంలో నవలగా రచించారు. కనుక ఇక్కడ మళ్లీ చెప్పలేదు. అలాగే అదే సంపుటిలోని కాదంబరి అనే కావ్యకథను కూడా విడిచిపెట్టాం. ఈ అనుసృజనలో మూలంలోని వర్ణనాసౌందర్యాన్ని చెడగొట్టలేదు. ఏ ముఖ్యవిషయాలు చెప్పడం ద్వారా పాఠకుల స్థాయి పెరిగేలా మూలకర్త వాటిని రచించారో.. వాటిని చెప్పకుండా వదిలి పెట్టలేదు. కాశీమజిలీ కథలకు రెండో మూడో సరళ అనువాదాలు వచ్చాయి. ఇందులోని అనేక కథలను విఠలాచార్య వంటివారు పలు సినిమాల్లో ఉపయోగించుకున్నారు. జగదేకవీరుని కథ, చిక్కడు దొరకడు.. వంటి హిట్ సినిమాలు కాశీమజిలీల్లోని ముఖ్యమైన థాట్‌ని ఉపయోగించుకుని చేసిన కథలే. కాశీమజిలీలను రూపొందించడంలో మధిర సుబ్బన్న దీక్షితకవి చూపించిన రచనా నైపుణ్యం అనితర సాధ్యం. అయినప్పటికీ ప్రతికథకూ ప్రాచీన సాహిత్యపు మూలాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రధానంగా కథాసరిత్సాగరం కనిపిస్తుంది. అలాగే సంస్కృత కావ్యాలలోని కథలను తనదైన భాషలోకి మలుచుకుని, గమ్మత్తయిన మలుపులతో మధిర సుబ్బన్న దీక్షితులు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించారు. నేటికీ ఈ కథలు వీటికివే సాటి అని చెప్పుకోవాలి. ఈ అనుసృజనకు ఇది చివరి భాగం. కాశీమజిలీల్లోని తొలిభాగం మణిసిద్ధుడనే యతికి, గోపాలకుడికి మధ్య సంభాషణతో మొదలు అవుతుంది. 12వ సంపుటిలో కాశీమాహాత్మ్య గాథలుంటాయి. అవన్నీ మన పౌరాణికాలను పరమార్థ బోధారూపంగా చెప్పినవి. కాశీఖండం నుంచి స్వీకరించిన దివోదాసు కథ ప్రత్యేకంగా ఇందులో వర్ణించారు. ఈ కథ పద్మకల్పంలోని స్వాయంభువ మనువు కాలానికి చెందినది. అప్పట్లో అరవై ఏళ్లపాటు భూమిపై అనావృష్టి సంభవించింది. పాడిపంటలు నశించాయి. ప్రజలు విశూచి, మశూచి మొదలైన దారుణ రోగాలపాలయ్యారు. ప్రజలు కోటానుకోట్లుగా మరణిస్తుండగా, యమధర్మరాజు విసిగిపోసాగాడు. యజ్ఞయాగాదికాలు చెడ్డాయి. మానవులకు కలుగుతున్న అన్యాయానికి ఇంద్రాదులను నిలవేసి అడిగేవారే కరవయ్యారు. ఈ విశేషాలన్నీ నారదుడి వల్ల విన్న బ్రహ్మదేవుడు.. స్వాయంభువ మనువు వంశంలో పుట్టిన రిపుంజయుణ్ని ధరణీచక్రాన్ని పాలించవలసిందిగా నియమించాడు. రిపుంజయుని పేరును దివోదాసుగా మార్చాడు. అయితే దివోదాసు ఒక షరతు పెట్టాడు. “దేవతలకు స్వర్గం, నాగులకు పాతాళం ఉండగా.. వారు ఈ భూమిమీద ఎందుకు సంచరించాలి? వాళ్లు భూమి వదిలిపోవాలి. నేను కాశీని రాజధానిగా పాలిస్తాను.. కనుక శివుడు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలి” అన్నాడు. బ్రహ్మదేవుడు అతని కోరికను శివునికి విన్నవించగా.. “బ్రహ్మ! నీవు చేసిన నిర్ణయానికి కట్టుబడి.. నేను మందర పర్వతానికి వెళ్లిపోతాను. నేను తిరిగి వచ్చేదాకా ఈ ధరణీచక్రాన్ని దివోదాసుడే ఏలనీ” అన్నాడు. దివోదాసు అధికారం చేపట్టగానే నేలపై పాతాళవాసులను తరిమికొట్టాడు. తన బలంతో వర్షదేవతలను శాసించి వర్షాలు కురిపించాడు. దాంతో భూమి సస్యశ్యామలమైంది. నేలపై ధర్మం నాలుగు పాదాలతో నడవ సాగింది. కొంతకాలం జరిగిన పిమ్మట దివోదాసు రాజ్యంలో పుట్టలోని పామువల్ల పుత్రుణ్ని పోగొట్టుకున్న ఆటవికులు న్యాయంకోసం అతని వద్దకు వచ్చారు. వారికి ఆ పుత్రుణ్ని తిరిగి ఇచ్చే నిమిత్తం.. దివోదాసు కథంతా చిత్రవిచిత్రాలతో సుబ్బన్న దీక్షితులుగారి శైలిలో సుందరంగా సాగుతుంది. ఆ కథలో భాగంగా రసాతలం నుంచి నాగులు, యక్షులు మొదలైనవారంతా భూమిపై నివసించడానికి తగిన అనుమతిని దివోదాసు మంజూరు చేశాడు. కానీ, దేవతలను మాత్రం రానివ్వలేదు. కాశీని విడిచి ఉండటం ఇష్టంలేని దేవతలు బృహస్పతికి మొరపెట్టుకున్నారు. ఆయన సూచన మేరకు భూలోకంలో అగ్నిదేవుడు తన తత్వాన్ని ఉపసంహరించాడు. వాయువు స్తంభించాడు. వరుణుడు వర్షించడం మానేశాడు. దేవతల కపటం గ్రహించిన దివోదాసు, తన యోగవిద్యాబలంతో తానే సర్వదేవతామయునిగా మారిపోయాడు. రాజ్యాన్ని ఎప్పటిలా పాలించసాగాడు. కాశీనగరం శివుని నివాసభూమి. ఆయన కాశీవియోగాన్ని సహించలేక ముందుగా అరవైనాలుగు మంది యోగినీస్త్రీలను కాశీకి పంపాడు. వారు కాశీలో స్థిరపడిపోయారు. ఆలస్యం భరించలేక, శివుడు తరువాత సూర్యుడిని పిలిచాడు. “దివోదాసును ఏదోవిధంగా ధర్మవిముఖుడిని చేయి” అని కోరాడు. కానీ ఆ పని సూర్యుడివల్ల కూడా కాలేదు. అటుపై ఈశ్వరుని ఆజ్ఞపై బ్రహ్మ బ్రాహ్మణ వేషంలో కాశీకి వెళ్లి.. దశాశ్వమేధ యాగాలతో ఈశ్వరుడిని ప్రతిష్ఠించి.. గంగానదికి పడమటి తీరంలో ఉండసాగాడు. కానీ, కాశీని విడిచిపెట్టి వెనక్కు రాలేకపోయాడు. ఆ తరువాత ప్రమథులు కూడా వెళ్లి.. ఆ క్షేత్రంలోని అద్భుతానందాన్ని అనుభవిస్తూ అక్కడే ఉండిపోయారు. అప్పుడు డుంఠి భట్టారకుడై గణపతి వెళ్లాడు. అతడు కాశీవాసులకు అనేక దుశ్శకునాలు కల్పిస్తూ, వాటికి శాంతులు కూడా తెలియచేయసాగాడు. ఒకనాడు డుంఠి భట్టారకుని దర్శనానికి దివోదాసు వెళ్లాడు. “కాశీ ప్రజలకు ఉత్పాతాలు రావడానికి కారణం ఏమిటి?” అని ప్రశ్నించాడు. అప్పుడు భట్టారకుడు.. “ఇటుపైన ఇంకా ఉత్పాతాలు రావడానికి అవకాశముంది. వాటిని నేను ఉపశమింప చేయగలను. కానీ, నువ్వు ఇక్కడ ఉండటం మంచిదికాదు. నేటికి పద్దెనిమిదో రోజున నీకోసం ఒక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు చెప్పినట్లుగా చేయి” అని సూచించాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ పద్దెనిమిది రోజులలో చాలా వింతలు జరిగాయి. విష్ణువే లక్ష్మీ గరుడ సమేతంగా దిగివచ్చాడు. వాళ్ల బోధలతో అధర్మం పెచ్చుపెరిగి పోయింది. పద్దెనిమిదో రోజున మధుసూదనుడు బ్రాహ్మణ వేషంలో దివోదాసుని కలుసుకున్నాడు. అప్పుడు విఘ్నేశ్వరుడు రాజు హృదయాన్ని ఆవేశించి ఉన్నాడు. “ఇన్నాళ్లూ నా రాజ్యంలో అకాల మరణాలు, వ్యాధులు, దారిద్ర్యం, ముసలితనం లేవు. ఎందుకో అవన్నీ ఇప్పుడు కలుగుతున్నాయి. నేను దేవతలను తృణీకరించిన అపరాధం తప్ప మరే దోషమూ ఎరుగను. ఇదంతా దేవతలు కల్పించిన నాటకంలా కనిపిస్తున్నది. ఏదేమైనా నేను చాలాకాలం రాజ్యం చేశాను. నా ఇంద్రియాలు విశ్రాంతి కోరుతున్నాయి. నేను మోక్షం కోరుకుంటున్నాను. ఏం చేయాలో సెలవియ్యండి” అని కోరాడు దివోదాసుడు. ఆపైన మధుసూదనుడు చెప్పినట్లుగా, కాశీలో లింగప్రతిష్ఠ చేశాడు. తన కొడుక్కి పట్టాభిషేకం చేసి, దైవభక్తిని ఉపదేశించాడు. తాను తపోవనానికి వెళ్లిపోయాడు. దివోదాసు వారణాసి వదిలేసి వెళ్లాడన్న వార్త విష్ణువు ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు తిరిగి వచ్చాడు. ఆయనతోపాటు సర్వదేవతలూ కాశీ చేరుకున్నారు. ఆనాటినుంచి ఈ భూమండలాన్ని దేవతలే పాలిస్తారని విశ్వేశ్వరుడు ప్రకటించాడు. దివోదాసు కథ తరువాత, కాశీమజిలీ కథల్లోని 12వ సంపుటిలో.. పుండరీకుని కథను వర్ణించారు. ఈ కథ మనందరం ఎరిగిన పాండురంగ మహత్యాన్ని చాటే పుండరీకుని కథ కాదు. వైకుంఠ సభలో ఈశ్వరుడి చేత శపించబడిన ఇంద్ర, చంద్రులు.. పుండరీక, కుమారకేసరులుగా జన్మించారు. పార్వతీదేవి శాపం వల్ల అహల్య, తార పాతాళంలో ఉదయసుందరి, తారావళులుగా పుట్టి, భూలోకంలో అనేక కష్టాలు పడ్డారు. పుండరీక, కుమారకేసరులను పెళ్లాడారు. వాళ్లే తరువాతి జన్మలో గంధర్వలోకంలో హంసుడికి మహాశ్వేతగా, చిత్రరథుడికి కాదంబరిగా.. ఈశ్వరుడి వరం వల్ల జన్మించారు. ఇంద్రచంద్రుల మరో రూపాలైన చంద్రాపీడ, పుండరీకులని వివాహమాడి సంతానం పొందగానే వారి శాపం తొలగిపోయింది. చంద్రుడి భార్య అయిన రోహిణి కూడా అతణ్ని మూడు జన్మలలోనూ అనుసరించింది. కాశీమజిలీల్లో అటుపైన వైశ్వానర, నిర్భృతి, వరుణుడు మొదలైన దిక్పతుల పూర్వగాథలు ఉంటాయి. చివరిగా మణిసిద్ధుడు, గోపాలుడు కాశీపుర ప్రవేశం చేసి, అక్కడే స్థిరపడడంతో పన్నెండో భాగం పరిసమాప్తమైంది.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 06 - 09 - 2025

## స్వల్ప లాభాలతో సరి దేశీయ స్టాక్ మార్కెట




__ ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. జీఎస్టీలో పెద్ద ఎత్తున సంస్కరణలను తీసుకురావడంతో ప్రారంభంలో భారీగా లాభపడిన మార్కెట్లు..చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయాయి. సెన్సెక్స్ 150, నిఫ్టీ 19 పాయింట్ల లాభంముంబై, సెప్టెంబర్ 4: దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. జీఎస్టీలో పెద్ద ఎత్తున సంస్కరణలను తీసుకురావడంతో ప్రారంభంలో భారీగా లాభపడిన మార్కెట్లు..చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయాయి.ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 150.30 పాయింట్లు అందుకొని 80,718.01 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కేవలం 19.25 పాయింట్లు అందుకొని 24,734 వద్ద ముగిసింది

## పసిడి పరుగుకు బ్రేక్.. రూ.1,000 తగ్గిన తులం ధర



ధరలకు బ్రేక్‌పడింది. వరుసగా ఎనిమిది రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన అతి విలువైన లోహాల ధరల దిద్దుబాటుకు గురయ్యాయి.రూ.1.06 లక్షల స్థాయికి విలువధరలకు బ్రేక్‌పడింది. వరుసగా ఎనిమిది రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన అతి విలువైన లోహాల ధరల దిద్దుబాటుకు గురయ్యాయి. దీంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,000 తగ్గి రూ.1,06,070కి దిగొచ్చింది. అంతకుముందు ధర రూ.1,07,070గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర కూడా అంతే స్థాయిలో తగ్గి రూ.1,05,200గా నమోదైనట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.బంగారంతోపాటు వెండి ధరలు కూడా దిగొచ్చాయి. అధిక ధరల కారణంగా పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.1,25,600గా నమోదైంది. వెండి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,26,100 పలికిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు దిగొచ్చాయని బులియన్ ట్రేడర్ వెల్లడించారు. ఔన్స్ గోల్డ్ ధర ఒకేరోజు 39.61 డాలర్లు లేదా 1.10 శాతం తగ్గి 3,539.14 డాలర్లకు పడిపోయింది. బుధవారం రికార్డు స్థాయి 3,578.80 డాలర్లు పలికిన విషయం తెలిసిందే. అలాగే వెండి 40.93 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

## జీఎస్టీ సంస్కరణలు.. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. జీఎస్టీ శ్లాబ్‌లను మారుతూ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండు మాత్రమే ఉండనున్నాయి. %హ్‌శిఎ మీథీఎవ్% ఎ దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. జీఎస్టీ శ్లాబ్‌లను మారుతూ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండు మాత్రమే ఉండనున్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 12శాతం, 28శాతం శ్లాబ్‌లను జీఎస్టీ కౌన్సిల్ తొలగించింది. ఈ క్రమంలో ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలు, జీఎస్టీ సంస్కరణలతో మార్కెట్లు భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో భారీగా అమ్మకాలు జరగడంతో మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌లో పోలిస్తే సెన్సెక్స్ 81,456.67 పాయింట్ల లాభాల్లో మొదలైంది.ఇంట్రాడేలో 81,456.67 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. 80,608.94 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 150.30 పాయింట్ల లాభంతో 80,718.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.25 పాయింట్లు పెరిగి 24,734.30 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.6 శాతం పతనమయ్యాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే లాభాల్లో కొనసాగగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా కన్స్యూమర్, విప్రో, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ నష్టపోయాయి. ఆటో ఇండెక్స్ దాదాపు 1శాతం, ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ 0.3 శాతం, ఐటీ, మీడియా, మెటల్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ 0.5 నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి.బ్రిటానియా, బాటా ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్ జీఎస్టీ పన్ను కోతల తర్వాత ఒకటి నుంచి ఆరుశాతం వరకు పెరిగాయి. జీఎస్టీ 12శాతం నుంచి 5శాతానికి తగ్గింపుతో బికాజీ, ప్రతాప్ స్నాక్స్ షేర్లు 3శాతం పెరిగాయి. పన్నును 28 శాతం నుంచి 40 శాతానికి పెంచడంతో డెల్టా కార్ప్ షేర్లు 8శాతం పడిపోయాయి. బీఎస్ఇలో దాదాపు 140 స్టాక్‌లు 52 వారాల గరిష్టానికి చేరాయి. ఎం అండ్ ఎం, జైడస్ వెల్నెస్, మహారాష్ట్ర స్కూటర్స్, ముత్తూట్ ఫైనాన్స్, నువోకో విస్టాస్, కమ్మిన్స్ ఇండియా, ఐషర్ మోటార్స్, నైకా, టీవీఎస్ మోటార్, లెమన్ ట్రీ హోటల్స్, మారికో, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, దాల్మియా భారత్, ఎంఆర్ఎఫ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండియా సిమెంట్స్, మారుతి సుజుకి, పేటీఎం ఉన్నాయి. యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 14 పైసలు తగ్గి 88.16 వద్ద ముగిసింది.

కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండు మాత్రమే ఉండనున్నాయి. %హ్‌శిఎ మీథీఎవ్% ఎ దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. జీఎస్టీ శ్లాబ్‌లను మారుతూ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండు మాత్రమే ఉండనున్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి ంక్రమంలో ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలు, జీఎస్టీ సంస్కరణలతో మార్కెట్లు భారీ లాభాల్లో ఎటీఎం ఉన్నాయి. యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 14 పైసలు తగ్గి 88.16 వద్ద ముగిసింది.

## బొగ్గుపై పెరుగనున్న జీఎస్టీ భారం.. విద్యుత్తు ధరలకు రెక్కలు?

**బొగ్గుపై 5% నుంచి 18 శాతానిక**

**పెరుగుతున్న జీఎస్టీ భారం**

**దేశంలో కరెంటు చార్జీలు పెరగొచ్చన్న అంచనాలు**

**అదే జరిగితే.. తయారీ రంగానికి కష్టాలే**

**ఆందోళనలో వ్యాపార, పారిశ్రామిక వర్గాలు**

జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు దేశంలో కరెంటు కష్టాలకు దారితీయనున్నాయా? విద్యుదుత్పత్తి ఖర్చులు పెరిగి సామాన్యుల దగ్గర్నుంచి వ్యాపార-పారిశ్రామిక, వ్యవసాయ రంగాలదాకా చార్జీల భారం పడనున్నదా? వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు దేశంలో కరెంటు కష్టాలకు దారితీయనున్నాయా? విద్యుదుత్పత్తి ఖర్చులు పెరిగి సామాన్యుల దగ్గర్నుంచి వ్యాపార-పారిశ్రామిక, వ్యవసాయ రంగాలదాకా చార్జీల భారం పడనున్నదా? కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి వస్తే ఇంతేనన్న అంచనాలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. బొగ్గుపై వస్తు, సేవల పన్ను భారం త్వరలో ఏకంగా 13% పెరుగుతున్నది. ప్రస్తుతం 5 శాతం శ్రేణిలో ఉన్న బొగ్గుపై.. కొత్త విధానంలో 18 శాతం జీఎస్టీ రేటు పడబోతున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారజీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు దేశంలో కరెంటు కష్టాలకు దారితీయనున్నాయా? విద్యుదుత్పత్తి ఖర్చులు పెరిగి సామాన్యుల దగ్గర్నుంచి వ్యాపార-పారిశ్రామిక, వ్యవసాయ రంగాలదాకా చార్జీల భారం పడనున్నదా? కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి వస్తే ఇంతేనన్న అంచనాలు ఇప్పుడు వినిపిస్తున్నాయి మరి. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు గొప్పగా చెప్పుకుంటున్న జీఎస్టీ సంస్కరణలతో దేశవ్యాప్తంగా కరెంటు కష్టాలు రావచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అవును.. బొగ్గుపై వస్తు, సేవల పన్ను భారం త్వరలో ఏకంగా 13 శాతం పెరుగుతున్నది మరి. ప్రస్తుతం 5 శాతం శ్రేణిలో ఉన్న బొగ్గుపై.. కొత్త విధానంలో 18 శాతం జీఎస్టీ రేటు పడబోతున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానుండగా.. థర్మల్ విద్యుదుత్పత్తిఖరీదెక్కడం ఖాయంగానే కనిపిస్తున్నది.ఇదీ సంగతి..ప్రస్తుతం దేశీయ విద్యుత్తు అవసరాల్లో 50 శాతానికిపైగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదక కేంద్రాల ద్వారానే తీరుతున్నాయి. సౌర, జల, పవన తదితర వనరుల ద్వారా మిగతా అవసరాలను తీర్చుకుంటున్నాం. ఈ క్రమంలో జీఎస్టీ భారం అమాంతం దాదాపు మూడు రెట్లు పెరిగితే థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలు ఒత్తిడికి గురవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతిమంగా ఆ భారం వినియోగదారులపైనే పడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఇది యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం అని హెచ్చరిస్తుండటం గమనార్హం. సామాన్యులతోపాటు వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక రంగాలు ప్రభావితం అవుతాయని అంటున్నారు. ఉత్పాదక వ్యయం పెరిగి వస్తూత్పత్తుల ధరలు ఎగబాకితే ద్రవ్యోల్బణం విజృంభిస్తుందని, దీంతో కఠిన ద్రవ్య విధానాలు, జీడీపీ పతనం వంటివి సంభవిస్తాయని వివరిస్తున్నారు. కాగా, దేశీయంగా థర్మల్ విద్యుదుత్పత్తితో కాలుష్యం పెరుగుతున్నదని, అందుకే దానిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని కేంద్రం చూస్తున్నట్టు చెప్తున్నారు. కాబట్టే జీఎస్టీ పెంపు అన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే థర్మల్ విద్యుదుత్పత్తిని ఇలా తగ్గించడం సరికాదన్న అభిప్రాయాలను ఇప్పుడు మెజారిటీ వర్గాలు వెలిబుచ్చుతున్నాయి.నష్టపరిహార సెస్సుతో..ప్రస్తుతం బొగ్గుపై 5 శాతం జీఎస్టీ, టన్నుకు రూ.400 చొప్పున నష్టపరిహార సెస్సు (40%) అమలవుతున్నది. అయితే ఈ సెస్సుకు స్వస్తి చెప్పాలని జీఎస్టీ కౌన్సిల్ సిఫారసు చేసింది. దీంతో 18 శాతం జీఎస్టీ పడినా ఇప్పటితో చూస్తే ఏమంత భారం ఉండబోదని కేంద్రం వాదిస్తున్నది. అయితే జీఎస్టీ రాకతో తమ ఆదాయం కోల్పోయామని, నష్టపరిహార సెస్సును మరో ఐదేండ్లు పొడిగించాలని చాలా రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. నిజానికి వచ్చే ఏడాది మార్చి 31తో ఈ సెస్సు కాలపరిమితి తీరిపోనుండగా, ఈ ఏడాది ఆఖరుకల్లా దాన్ని తీసేయాలని కేంద్రం చూస్తున్నది. ఇలా ఇప్పటికైతే ఈ సెస్సుపై అస్పష్టతే నెలకొన్నది. ఈ నేపథ్యంలో దారితీస్తున్నదిప్పుడు.ఇది పరోక్ష భారమే..ఈ పరోక్ష పన్ను రేట్ల సవరణలతో వినియోగదారులపై పరోక్షంగా భారమే పడుతుందని ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ టీకే అరుణ్ అభిప్రాయపడ్డారు. బొగ్గుపై జీఎస్టీని పెంచడమేగాక, పైప్‌లైన్ ద్వారా ముడి, రిఫైన్డ్ ఉత్పత్తుల రవాణా సేవలపై పన్నును 12 నుంచి 18 శాతానికి తీసుకెళ్లడం అనేక రకాల నష్టాలకు దారి తీస్తుందన్నారు.




## కొత్త బైక్ కొనాలనుకుంటున్నారా? ఆగండి ఆగండి..! త్వరలో భారీగా తగ్గనున్న ధరలు.. వారికి మాత్రం నిరాశే..!



కేంద్ర సర్కారు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ క్రమంలో బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో శ్లాబ్‌లను కుదిస్తూ ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో రెండు మాత్రమే ఉండనున్నాయి. దాంతో పలు వస్తువుల ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. కేంద్ర సర్కారు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ క్రమంలో బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో శ్లాబ్‌లను కుదిస్తూ ఆమోదముద్ర శ్లాబుల స్థానంలో రెండు మాత్రమే ఉండనున్నాయి. దాంతో పలు వస్తువుల ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే, తక్కువ సీసీ సామర్థ్యం గల ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరట కలుగనున్నది. 350 సీసీ లేదంటే అంతకంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న బైక్‌లపై జీఎస్టీని 28శాతం నుంచి 18శాతానికి తగ్గించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. దాంతో హీరో స్ప్లెండర్, హోండా షైన్ సహా తక్కువ సీసీ ఇంజిన్ సామర్థ్యం గల బౌక్‌ల ధరలన్నీ తగ్గనున్నాయి. ఆయా బైక్‌ల మోడల్స్‌పై పదిశాతం వరకు డబ్బు ఆదా కానున్నది. అయితే, 350 కంటే ఎక్కువ సీసీ గల బైక్‌లను కొనుగోలు చేయాలనుకున్న వారికి మాత్రం నిరాశే మిగలనున్నది.ఎందుకంటే 350సీసీ కంటే ఎక్కువ శక్తివంతమైన ఇంజిన్ సామర్థ్యం గల బైక్‌లను 'సిన్ టాక్స్' శ్లాబ్‌లోనే ఉంచారు. వాటిపై 40శాతం జీఎస్టీ వర్తిస్తుంది. జీఎస్టీ శ్లాబ్‌పై తుది నిర్ణయం తీసుకునే ముందు రాయల్ ఎన్‌ఫీల్డ్, బజాజ్ వంటి కంపెనీలు అన్ని రకాల బైక్‌లపై ఒకే జీఎస్టీ రేట్‌ను వర్తింపజేయాలని కోరాయి. అయితే, 390సీసీ, 400సీసీ, 450సీసీ, 650సీసీ, బీఎండబ్ల్యూ, కవాసకి, హోండా, యమహా క్లాస్ బైక్‌లపై కూడా 40శాతం విధించనున్నారు. నివేదిక ప్రకారం కొత్త జీఎస్టీ రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వస్తాయి. అప్పటిలోగా బైక్‌లను కొనుగోలు చేస్తే 10శాతం వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం, బైక్‌లపై జీఎస్టీ 28శాతం వర్తిస్తున్నది. అయితే, 400 సీసీ అంతకంటే ఎక్కువ సీసీ మోటార్ సైకిల్స్‌ను కొనుగోలు చేయాలని భావిస్తే మాత్రం ఎమాత్రం ఆలస్యం చేయకుండా ఇప్పుడే కొనుగోలు చేయడం ఉత్తమమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత జీఎస్టీ సెప్టెంబర్ 21 వరకు అవకాశం ఉంటుంది.22వ తేదీ తర్వాత ఆయా బైక్‌ల ధరలను పెరిగే అవకాశాలున్నాయి. బజాజ్ పల్సర్ %చీూ 400%, బజాజ్ డొమినార్ 400, %ఖువీ% 390 డ్యూక్, %ఖువీ 390 =జ%, రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ 450, రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 450, రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350, రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ %+ు% 650, ట్రయంఫ్ స్పీడ్ 400, ట్రయంఫ్ థ్రక్టన్ 400, ట్రయంఫ్ స్పీడ్ %ు%4, ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400%ఞ%, హోండా %జదీ 650=% ధరలు పెరగనున్నాయి. బజాజ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ట్రయంఫ్, ఎటీఎం వంటి కంపెనీలు ప్రీమియం సెగ్మెంట్ బైక్‌లను సరసమైన ధరలకు తయారు చేస్తున్నాయి. స్థానిక తయారీ ఈ కంపెనీలకు పెద్ద ఇంజిన్‌లతో బైక్‌ల ధరను సమతుల్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఈ విభాగంలో బైక్‌లు ఇప్పటికే చాలా తక్కువ సంఖ్యలో అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు పన్నులు పెరిగితే 350సీసీ.. అంతకంటే కంటే ఎక్కువ సీసీ ఉన్న బైక్‌ల అమ్మకాలు మరింత పడిపోయే అవకాశాలున్నాయి

## సిమెంట్, ఉక్కుపై జీఎస్టీ రేట్ల తగ్గింపు.. రియల్ ఎస్టేట్‌కు ప్రోత్సాహం..!

ంద్రం ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. నాలుగు శ్లాబులను రెండింటికి కుదించింది. ఈ మార్పుతో రియల్ ఎస్టేట్‌కు ఊతం లభిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. నిర్మాణరంగంలోని పలు వస్తువల ధరలకు సంబంధించిన శ్లాబ్‌ను మార్చడంతో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. నాలుగు శ్లాబులను రెండింటికి కుదించింది. ఈ మార్పుతో రియల్ ఎస్టేట్‌కు ఊతం లభిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. నిర్మాణరంగంలోని పలు వస్తువల ధరలకు సంబంధించిన శ్లాబ్‌ను మార్చడంతో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. భారత్, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా సీబీఆర్ఈ అధ్యక్షుడు, సీఈవో అన్షుమాన్ జీఎస్టీ మార్పుతో వ్యయ ప్రభావాలను హైలెట్ చేశారు. సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్ సాధారణంగా మొత్తం నిర్మాణ వ్యయంలో 40-45 శాతం వాటా కలిగి ఉంటాయని తెలిపారు. దాంతో తగ్గింపు ప్రాజెక్ట్ ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. డెవలపర్లు ఇప్పుడు పొదుపులో కొంత భాగాన్ని గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయవచ్చని.. దాంతో గృహాలను కొనుగోలు చేసే అవకాశం పెరగడంతో అన్నిరంగాల్లో డిమాండ్‌ను పెంచుతుందన్నారు. పండుగ సీజన్‌లో సరైన సమయంలోనే జీఎస్టీ సంస్కరణలు వచ్చాయి. గృహాభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధారిత ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వ విస్తృత దృష్టికి ప్రభుత్వ చర్యలు ఊతమిస్తాయని సంబంధిత వర్గాలు నరేడ్కో నేషనల్ చైర్మన్ నిరంజన్ హిరనందని కేంద్రం నిర్ణయాన్ని భారతీయవినియోగదారులకు 'పండుగ కానుక'గా, ఆర్థిక వ్యవస్థకు వ్యూహాత్మక ప్రోత్సాహకంగా అభివర్ణించారు. రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాలకు, సిమెంట్, ఉక్కు వంటి కీలకమైన నిర్మాణ సామగ్రిపై జీఎస్టీని 28శాతంనుంచి18శాతానికి తగ్గించడం చారిత్రాత్మక సంస్కరణగా పేర్కొన్నారు. నిర్మాణ వ్యయంలో తగ్గుదల గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయడం వల్ల.. గృహ నిర్మాణ రంగంఎక్కువగాప్రయోజనం పొందుతుందని హిరనందని తెలిపారు. దాంతోగృహాలుమరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇది 'అందరికీ గృహనిర్మాణం' అనే ప్రభుత్వ కల సాకారానికి ఊతమిస్తుందని తెలిపారు. డెవలపర్లకు మాత్రమే కాకుండా వినియోగదారులకు, గృహనిర్మాణ రంగానికి.. భారతదేశ దీర్ఘకాలిక వృద్ధికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, నరేడ్కో జాతీయ అధ్యక్షుడు జీ హరిబాబు మాట్లాడుతూ జీఎస్టీ హేతుబద్ధీకరించడం చాలా ముఖ్యమైన దశ అని.. పరిశ్రమ హృదయపూర్వకంగా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ చర్య రియల్ ఎస్టేట్, సంబంధిత పరిశ్రమలకు ప్రత్యేక ఉపశమనం కల్పిస్తుందని హరిబాబు తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగానికి, దేశ వృద్ధికి ఒక విజయమని.. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక ఊపును సృష్టించే ప్రగతిశీల చర్యగా భావిస్తున్నామన్నారు




## మారిన జీఎస్టీ శ్లాబులు.. ఏసీలు, టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గుతాయా.. పెరుగుతాయా..?



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబులు ఉండగా.. రెండింటికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలకు ఆమోదం తెలిపారు. ఈ నెల 22 నుంచి కొత్త శ్లాబులు అమలులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబులు ఉండగా.. రెండింటికి తగ్గిస్తూ నిర్ణయం సంస్కరణలకు ఆమోదం తెలిపారు. ఈ నెల 22 నుంచి కొత్త శ్లాబులు అమలులోకి రానున్నాయి. ప్రభుత్వం ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నును తగ్గించింది. చాలా ఉత్పత్తులపై జీఎస్టీ 28శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయాలనుకునేవారికి మాత్రం ఎలాంటి ఊరటనివ్వలేదు. జీఎస్టీ సంస్కరణల తర్వాత కూడా స్మార్ట్‌ఫోన్లపై జీఎస్టీ 18శాతం వర్తిస్తుంది. మొబైల్ ఫోన్లు ఇప్పటికే 18శాతం శ్లాబ్‌లోనే ఉంటుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.18శాతం తర్వాత 5శాతం శ్లాబ్ మాత్రమే ఉందని.. దాంతో స్మార్‌ఫోన్ తయారీదారులు ఎలాంటి మార్పులను ఆశించడం లేదని.. స్మార్ట్‌ఫోన్లపై పన్ను తగ్గిస్తే బాగుంటుందని ఇండస్ట్రీ మాత్రం ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకు ముందు ఎయిర్ కండీషన్‌లపై జీఎస్టీ 28శాతం వర్తించేది. ఇకపై 18శాతం శ్లాబ్‌లోకి ఏసీలు రానున్నాయి. 32 ఇంచులకంటే పెద్ద ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీలపై 28శాతం నుంచి 18శాతానికి తగ్గించారు. ఇప్పటికే 32ఇంచులు, అంతకంటే తక్కువగా ఉన్న టీవీలపై జీఎస్టీ 18శాతం వర్తిస్తున్నది. ఇక కంప్యూటర్ మానిటర్లు, ప్రొజెక్టర్లు ప్రస్తుతం 28శాతం శ్లాబ్‌లో ఉండగా.. వాటిని 18శాతం శ్లాబ్‌లోకి మార్చారు. కిచెన్ డిష్‌వాషర్లపై సైతం 18శాతం జీఎస్టీ ఉండనున్నది.ఇదిలా ఉండగా.. 8507 కేటగిరీ కిందకు వచ్చే లిథియం అయాన్ బ్యాటరీలు గతంలో 28శాతం శ్లాబ్ పరిధిలో ఉండగా.. అవి 18శాతం జాబితాలోకి వెళ్లాయి. జీఎస్టీ తగ్గింపు తర్వాత మోడల్‌ను బట్టి ఎయిర్ కండిషనర్ల ధర రూ.1500 నుంచి రూ.2500 వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయి. టీవీలు, మానిటర్ల ధరలు సైతం తగ్గనున్నాయి. పన్ను తగ్గింపు నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని.. వాటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు ముందుకు వస్తారని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏసీ, టీవీ వంటి పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువల ధరల విషయంలో కాస్త ఉపశమనం లభించనుండగా.. స్మార్ట్‌ఫోన్లపై ఎలాంటి తగ్గింపు ఉండబోదని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న 18శాతం శ్లాబ్‌లోనే ఈ స్మార్ట్‌ఫోన్లను కొనసాగించడమే కారణమని స్పష్టం చేస్తున్నారు.



# అఖండ-2 మూవీ రిలీజ్ డేట్.. ఆ రోజైనా వచ్చేనా?

బాలకృష్ణ- బోయపాటి కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'అఖండ'. 2021 డిసెంబరులో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్‌గా అఖండ-2ను తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా టీజర్ కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ నెలలోనే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. పవన్ కల్యాణ్ హీరోగా వస్తోన్న ఓజీ ?సినిమా కోసం అఖండ-2ను వాయిదా వేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలయ్య సినిమా ఇంకెప్పుడా అని ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఉంటుందా లేదా అంతకుముందే డిసెంబర్‌లోనే రానుందా అని ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు తెగ కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. అఖండ-2 విడుదల తేదీని ఇప్పటివరకు మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా నందమూరి బాలకృష్ణ ఈ మూవీ రిలీజ్ డేట్‌పై హింట్ ఇచ్చేశారు. డిసెంబర్ తొలివారంలోనే అఖండ-2 రానుందని చెప్పేశారు. అయితే విడుదల తేదీని మాత్రం వెల్లడించలేదు. ఈ లెక్కన డిసెంబర్ 5న శుక్రవారం కావడంతో అదే రోజు రిలీజ్ కావొచ్చని టాలీవుడ్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఆ రోజైనా రిలీజవుతుందా? లేదంటే సంక్రాంతికి పోస్ట్‌పోన్ అవుతుందా? అనే విషయంపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# గుడ్ న్యూస్ చెప్పిన కీర్తి సురేష్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకుంది. అయినప్పటికీ ఇండస్ట్రీకి దూరం అవకుండా.. వరుస చిత్రాల్లో నటిస్తోంది. కానీ గత కొద్ది కాలంగా విజయాన్ని అందుకోలేకపోతుంది. ఇక ఇటీవల కీర్తి ఉప్పుకప్పురంబు, రివాల్వర్ రీటా చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. ఈ రెండు బాక్సాఫీసు వద్ద హిట్ సాధించలేకపోయాయి. ఇక 2023 నుంచి హిట్ కోసం తాపత్రయపడుతున్న కీర్తి సురేష్‌కు నిరాశనే మిగులుతోంది. పెళ్లైనప్పటి నుంచి అమ్మడుకి లక్ పెద్దగా కలిసిరావడం లేదు. అయినా హిట్, ఫ్లాప్ అని ఆలోచించకుండా వరుస ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తోంది. తాజాగా, కీర్తి సురేష్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ గుడ్ న్యూస్ ప్రకటించింది. తాను చేస్తున్న సినిమాకు సంబంధించిన విషయాలను వెల్లడించింది. ఇందులో కోలీవుడ్ కీర్తి సురేష్, సంచలన దర్శకుడు మిస్కిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రవీణ్ విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రొడక్షన్-9' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డ్రమ్‌స్టిక్ ప్రొడక్షన్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే త్వరలోనే షూటింగ్ కూడా స్టార్ట్ కాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. "మేము ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ప్రొడక్షన్-9 ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది" అనే క్యాప్షన్ జత చేసింది. అలాగే మూవీ టీమ్‌తో తీసుకున్న ఫొటోలను షేర్ చేసింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు సూపర్ ఎగ్జైటెడ్.. అంటూ కంగ్రాట్స్ చెబుతున్నారు.





# ఈ యూనిఫాం వేసుకున్న ప్రతీ ఒక్కడికి అందరూ ఫ్యామిలీనే రా..

## సస్పెన్స్‌గా అథర్వ మురళి టన్నెల్ ట్రైలర్

గద్దల కొండ గణేశ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాడు కోలీవుడ్ యాక్టర్ అథర్వ మురళి  తెలుగులో సినిమాలో మెరిసిన ఈ టాలెంటెడ్ యాక్టర్ టెన్నెల్ సినిమా కోసం ఖాకీ చొక్కా వేసుకున్నాడు. ఈ సారి యాక్షన్ ప్యాక్‌డ్ థ్రిల్లింగ్ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రవీంద్ర మాధవ దర్శకత్వంలో అథర్వ మురళి నటించిన తమిళ చిత్రం తెలుగులో టన్నెల్ పేరుతో విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే స్పెషల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ మూవీని తెలుగులో సెప్టెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. తాజాగా మేకర్స్ తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. పోలీసుల బృందం సైరన్ల మోతతో టన్నెల్‌లోకి ప్రవేశించగా.. ఓ వ్యక్తి వారికి ఎదురుగా వస్తాడు. ఎవడ్రా నువ్వు అని పోలీసులు అడిగితే ఆ వ్యక్తి పిస్తోల్‌తో ఫైరింగ్ చేసే సన్నివేశాలతో షురూ అయింది ట్రైలర్. అనుమానాస్పద హత్యలు, వాటిని అథర్వ మురళి అండ్ పోలీసుల టీం ఎలా చేధించారనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చాడు డైరెక్టర్. ఈ యూనిఫాం వేసుకున్న ప్రతీ ఒక్కడికి అందరు ఫ్యామిలీనే రా అంటూ అథర్వ మురళి చెప్తున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. క్రూరమైన హత్యల వెనుకున్న సైకోను పట్టుకునే పోలీసాఫీసర్‌గా అథర్వ మురళి కనిపించనున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ఇంతకీ అతడు ఆ సైకోను పట్టుకున్నాడా..? లేదా..? అనే సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో అశ్విన్ కాకుమాను విలన్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఏ రాజు నాయక్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి జస్టిన్ ప్రభాకరన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కొణిదెల హీరోయిన్‌గా నటిస్తోంది

# నెట్‌ఫ్లిక్స్‌లో శ్రద్ధా శ్రీనాథ్ కొత్త వెబ్ సిరీస్.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్ ఈ సిరీస్‌కు రాజేష్ ఎం. సెల్వా దర్శకత్వం వహిస్తుండగా.. సంతోష్ ప్రతాప్, చాందిని, శ్యామ హరిణి, బాలా హసన్, సుభాష్ సెల్వం, వివియా సంత, ధీరజ్, మరియు హేమ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్ నిర్మిస్తుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ వెబ్ సిరీస్ అక్టోబర్ 2, 2025 నుంచి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సిరీస్ ఒక గేమ్ డెవలపర్ జీవితం చుట్టూ తిరుగుతుంది. శ్రద్ధా శ్రీనాథ్ పోషించిన ఈ పాత్ర తనపై జరిగిన ఒక సామూహిక దాడి వెనుక ఉన్నవారిని కనిపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఆమెకు డిజిటల్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను, రహస్యాలను ఈ థ్రిల్లర్ సిరీస్ చూపిస్తుంది. ఈ సిరీస్ థ్రిల్లర్‌గా మాత్రమే కాకుండా, మనం నివసించే డిజిటల్ ప్రపంచం, రహస్యాలు, మరియు మారుతున్న సంబంధాలను కూడా ప్రతిబింబిస్తుంది.



Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332